




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 233 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ శుక్రవారం 15 మే 2026 పేజీలు : 12 వెల : 2/-


చట్టాన్ని ధిక్కరించే ధైర్యం

## ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?

- ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై జగన్ స్పందన
- ఫీడ్ కంపెనీలతో కూటమి ప్రభుత్వం కుమ్మక్కైందంటూ తీవ్ర విమర్శలు
- ధరలు తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్
- లేకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరిక



విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఫీడ్ కంపెనీలతో ప్రభుత్వం కుమ్మక్కై, కమీషన్ల కోసం ఆక్వా రైతులను దారుణంగా దోచుకుంటోందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పెంచిన ధరలను తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మిగతా .. 2లో..

హిందువులకు క్షమాపణ చెప్పిన


## కమెడియన్ అలీ



విశ్వం వాయిస్ న్యూస్ : టాలీవుడ్ సీనియర్ కమెడియన్ అలీ, తాను నటించిన ఒక వాణిజ్య ప్రకటనపై చెలరేగిన వివాదంపై స్పందించారు. హిందూ సమాజానికి, మనోభావాలు దెబ్బతిన్న ప్రతి ఒక్కరికీ ఆయన బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. ఘర్ సోప్ కోసం ఆయన చేసిన ప్రకటనలో మిగతా .. 2లో..

వారంలో ఒక రోజు

# 'నో వెహికిల్ డే'



- "నా దేశం - నా బాధ్యత" పేరుతో ఏపీలో పొదుపు చర్యలు ప్రారంభించిన ప్రభుత్వం
- మంత్రులు, ఎమ్మెల్యేలు కాన్వాయ్‌లు, విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని సీఎం ఆదేశం
- వారానికి ఒక రోజు 'నో వెహికల్ డే', సైకిళ్ల వాడకాన్ని ప్రోత్సహించాలని సూచన
- బంగారం కొనుగోళ్లు తగ్గించి, స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలని పిలుపు
- ఇది భయపెట్టడానికి కాదు, సంక్షోభాన్ని ఎదుర్కొనే ముందుజాగ్రత్త చర్య అని స్పష్టీకరణ

అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. "నా దేశం - నా బాధ్యత" అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమాజం సిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులు, విదేశీ మారక ద్రవ్యంపై తీవ్ర ఒత్తిడి పడుతోందని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పొదుపు చర్యలు పాటించడం ద్వారా దేశానికి మేలు చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చినట్లు తెలిపారు.

**ప్రజాప్రతినిధుల నుంచే మార్పు మొదలవ్వాలి..**

ఈ పొదుపు చర్యలు తొలుత ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచే ప్రారంభం కావాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మిగతా .. 2లో..

మోదీ పిలుపు..
దిల్లీలో వారానికి రెండు రోజులు

## వర్క్‌ఫ్రమ్ హోమ్



విశ్వం వాయిస్ న్యూస్ : పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు పాటించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన నేపథ్యంలో దిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి రెండు రోజుల వర్క్‌ఫ్రమ్ హోమ్ ప్రకటించింది. దీంతో పాటు ప్రభుత్వ విభాగాల్లో ఇంధన వినియోగాన్ని తగ్గించేలా 'నో వెహికల్ డే', ఆన్‌లైన్ సమావేశాల వంటి చర్యలు చేపట్టింది. ఈ మేరకు దిల్లీ సీఎం రేఖా గుప్తా మిగతా .. 2లో..

ఆర్డీటీ మనందరి సంస్థ..

## రాజకీయాలకు అతీతంగా అండగా నిలుద్దాం

- ఆర్డీటీ సంస్థకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి నారా లోకేష్ భరోసా
- ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీకి మద్దతివ్వాలని ప్రజలకు పిలుపు
- ఆర్డీటీ సేవలను ఆంధ్రప్రదేశ్ మొత్తం విస్తరించాలని కోరిన మంత్రి లోకేష్
- యువగళం హామీని నిలబెట్టుకుంటూ ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతులు వచ్చేలా కృషి
- మంత్రి హోదాలో తొలిసారి బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిని సందర్శించిన లోకేష్



సత్యసాయి జిల్లా, విశ్వం వాయిస్ న్యూస్ : "ఆర్డీటీ సంస్థకు నా వంతు సహాయం చేయగలగడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇది మనందరి సంస్థ. ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ ఆర్డీటీకి మద్దతుగా నిలవాలి. ఈ సంస్థ సేవలు ఆంధ్రప్రదేశ్ మొత్తం విస్తరించాలి, అందుకు మా ప్రభుత్వం అండగా నిలబడుతుంది," అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆసుపత్రిని సందర్శించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, "నా యువగళం పాదయాత్రకు ముందు ఆర్డీటీ గురించి విన్నాను. కానీ పాదయాత్రలో వారు చేస్తున్న అద్భుతమైన కార్యక్రమాలను కళ్లారా చూశాను. ఇంట్లో వికలాంగులుగా పుట్టిన పిల్లలను కొందరు తల్లిదండ్రులు బాధతో వదిలేస్తే, అలాంటి పిల్లలను సొంత బిడ్డల కన్నా గొప్పగా చూసుకుంటున్న ఆర్డీటీ పాఠశాలను చూసి చలించిపోయాను. అనంతపురం పాదయాత్రలో మొదటి సారి మాంచో ఫెర్రర్ గారిని కలిశాను. ఆర్డీటీ కేవలం ఒక సంస్థ కాదు, అదొక ఉద్యమం. 57 ఏళ్లుగా పాఠశాలలు, ఆసుపత్రులు, క్రీడలు, పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి ఎన్నో సేవలు అందిస్తున్న తీరు నన్ను కదిలించింది. పాదయాత్ర ఇతర జిల్లాలకు వెళ్లినా, నా ప్రసంగాల్లో ఆర్డీటీ గురించి మిగతా .. 2లో..

వైసీపీ హయాంలో జనాల కష్టాలను

## పట్టించుకోలేదు

మినీ మహానాడులో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వైసీపీ హయాంలో ప్రజా వ్యతిరేకత పెరిగిందని వ్యాఖ్య
గుంటూరును అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ



గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ : గుంటూరు వేదికగా జరిగిన టీడీపీ మినీ మహానాడులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక సంస్కృతి పెరిగిందని, జనం ఎదుర్కొంటున్న కష్టాలను ఆ ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదని ఆయన ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ కేవలం ఒక రాజకీయ సంస్థ మాత్రమే కాదని, అది ఒక వ్యక్తి హృదయ స్పందన నుంచి పుట్టిన పార్టీ అని అభివర్ణించిన పెమ్మసాని, మిగతా .. 2లో..

విదేశీ పర్యటనలకు ముందు..
వాన్స్ కోసం

## ట్రంప్ సీక్రెట్ లెటర్..?



విశ్వం వాయిస్ న్యూస్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సంబంధించి ఓ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. విదేశీ పర్యటనలకు వెళ్లే ప్రతిసారీ.. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కోసం ఆయన ఒక సీక్రెట్ లెటర్ రాసి ఉంచుతారట. ఈ విషయాన్ని వైట్‌హౌస్ అధికారి సెబాస్టియన్ గోర్క్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో గోర్క్ పేర్కొన్న విషయాలు చర్చనీయాంశంగా మారాయి. ట్రంప్ విదేశీ పర్యటనలకు వెళ్లే ముందు రిజల్యూట్ డెస్క్‌లో మిగతా .. 2లో..

## మోదీ పొదుపు మంత్రం.. ఎడ్లబండిపై పోలీసు బరాత్



విశ్వం వాయిస్ న్యూస్ : పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు పాటించాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపునకు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ వస్తోంది. ప్రముఖుల నుంచి సామాన్యుల వరకు ఇంధన ఆదా కోసం తమ వంతు కృషి చేస్తున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ పోలీసు కానిస్టేబుల్ తన పెళ్లి బరాత్ కోసం వాహనాలను పక్కనబెట్టి ఎడ్లబండ్లను వినియోగించారు. నారాయణ్‌పుర్ ఎస్పీకి గన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తోన్న కుబేర్ దెహారీకి రెండు రోజుల క్రితం వివాహమైంది. ఈ వివాహ వేడుక నిమిత్తం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న వధువు నివాసానికి కుబేర్ కుటుంబం ఎడ్ల బండ్లపై ఊరేగింపుగా వెళ్లింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై ఆయన మాట్లాడుతూ మిగతా .. 2లో..

## నెతన్యాహు మా దేశానికి రాలేదు

'రహస్య పర్యటన'పై యూఏఈ



విశ్వం వాయిస్ న్యూస్ : పశ్చిమాసియా ఉద్రిక్తతల సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బుధవారం రహస్యంగా యూఏఈలో పర్యటించినట్లు వచ్చిన వార్తలు చర్చనీయాంశమయ్యాయి. అయితే, ఈ ప్రచారాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తోసిపుచ్చింది. నెతన్యాహునే కాదు.. ఇజ్రాయెల్ సైనిక బృందం కూడా తమ దేశంలో పర్యటించలేదని స్పష్టం చేసింది. "ఇజ్రాయెల్‌తో మా సంబంధాలన్నీ బహిరంగమే. అబ్రహం ఒప్పందాలకు లోబడే ఇరుదేశాల మధ్య సంబంధాలు కొనసాగుతున్నాయి. ఇందులో ఎలాంటి రహస్యాలు, నిగూఢ వ్యవహారాలకు మిగతా .. 2లో..

భారత్ వద్ద ఇప్పటివరకు లేని

## స్టెల్త్ యుద్ధ విమానం

- తొలిసారిగా ఏపీలోనే తయారు... దేశానికే తలమానికం!
- పుట్టపర్తిలో దేశంలోనే తొలి 5వ తరం స్టెల్త్ ఫైటర్ ఏఎంసీఏ ప్రాజెక్టుకు రేపు శంకుస్థాపన
- రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి సీఎం చంద్రబాబు ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్న వైనం
- రూ.15,803 కోట్ల పెట్టుబడితో రానున్న ఈ ప్రాజెక్టులో యుద్ధ విమానాల తయారీ, టెస్టింగ్
- దీంతో పాటు మరో 12 డిఫెన్స్, డ్రోన్ ప్రాజెక్టులకు కూడా భూమిపూజ
- ఈ ప్రాజెక్టులతో రాయలసీమ ఇక రక్షణ, సాంకేతిక హబ్



పుట్టపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ : రాయలసీమ రతనాల సీమ... ఇది చరిత్ర. ఉద్యాన సీమ... ఇది వర్తమానం. ఇకపై దేశ 'రక్షణ సీమ'... ఇది భవిష్యత్. ఇరిగేషన్, హార్టికల్చర్, స్పేస్, సోలార్ వంటి రంగాల్లో ఇప్పటికే తనదైన ముద్ర వేసిన రాయలసీమ, ఇప్పుడు దేశ రక్షణ రంగంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోంది. దేశ భద్రతకు కీలకమైన అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు పుట్టపర్తి వేదిక కానుంది. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో శుక్రవారం, ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, డీఆర్‌డీఓ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టుకు మిగతా .. 2లో..

శబరిమల కేసులో

## 16 రోజుల విచారణ

తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం

విశ్వం వాయిస్ న్యూస్ : 'శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళల పట్ల వివక్ష' కేసులో సుప్రీంకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో గురువారం సర్వోన్నత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. మే 29 లోగా లిఖిత పూర్వక వాదనలు సమర్పించవచ్చని పేర్కొంది. మొత్తం 16 రోజుల పాటు విస్తృత ధర్మాసనం పిటీషనర్ల వాదనలు విన్నది. శబరిమలలో 10-50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ వయసు మహిళలకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరణ.. అంటరానితనంగా, రాజ్యాంగ అధికరణం 17కు ఉల్లంఘనగా ఉందని నాడు అత్యున్నత న్యాయస్థానం అభివర్ణించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ 2019 నవంబరులో నాటి సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టులో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది.

(మొదటిపేజీ తరువాయి)

### వారంలో ఒక రోజు

# 'నో వెహికిల్ డే'

పార్థసారథి తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలను పూర్తిగా రద్దు చేసుకోవాలన్నారు. వీలైతే ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని, సమీప ప్రాంతాలకు వెళ్లేటప్పుడు కార్లకు బదులుగా నడక లేదా సైకిల్‌ను ఆశ్రయించాలని సీఎం కోరారు. వారానికి ఒక రోజు (శుక్రవారం) 'నో వెహికల్ డే' పాటించాలని, ఆ రోజు వాహనాలు వినియోగించకుండా వర్చువల్ విధానంలో సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. అధికారులు కూడా వాహనాలను షేర్ చేసుకోవడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఇంధన వినియోగంపై వారానికోసారి సమీక్షించాలని, కొత్తగా కొనుగోలు చేసే వాహనాలు ఎలక్ట్రిక్ (ఈవీ) వాహనాలే అయి ఉండాలని క్యాబినెట్ నిర్ణయించింది.

**ప్రజలకు, రైతులకు కీలక విజ్ఞప్తులు**

ప్రజలు కూడా ఈ సంక్షోభ సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి కోరారు. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లే బదులు స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. బంగారం కొనుగోళ్లపై మోజు తగ్గించుకోవాలని, దీనివల్ల ఏటా వేల కోట్ల డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని అన్నారు. "స్టెప్ ఫర్ ది నేషన్" పేరుతో నడక, సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఇంధన, వ్యవసాయ రంగాల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టాలని సీఎం ఆదేశించారన్నారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'పీఎం సూర్యఘర్', 'కుసుమ్' వంటి సౌర విద్యుత్ పథకాలను మరింత వేగవంతం చేయాలని ఇంధన శాఖను ఆదేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం లక్షల మందికి మాత్రమే చేరిన ఈ పథకాలను విస్తృతం చేసేందుకు అవసరమైన పరికరాల తయారీదారులతో, సప్లై చైన్‌తో చర్చలు జరపాలని సూచించారన్నారు. అలాగే, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) వంటి ప్రత్యామ్నాయ ఇంధన ప్లాంట్ల ఏర్పాటుకు భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారన్నారు. వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, ముఖ్యంగా యూరియా వినియోగంలో రైతుల మధ్య చాలా వ్యత్యాసం ఉందని పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రైతులు ఎకరానికి రెండు బస్తాలు వాడుతుంటే, మరికొందరు మూడు, నాలుగు బస్తాలు వాడుతున్నారని, ఇది శాస్త్రీయంగా సరైంది కాదన్నారు. అధిక దిగుబడి కోసం కెమికల్స్ వాడకం వల్ల భూసారం దెబ్బతింటోందని, దీన్ని తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా వచ్చిన 'నానో యూరియా' వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. డ్రోన్ల సహాయంతో నానో యూరియాను పొలం అంతటా సమానంగా చల్లడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని, రైతులు ఈ దిశగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

**ముందు జాగ్రత్తే కానీ, భయం వద్దు**

ఈ చర్యలన్నీ ప్రజలను భయపెట్టడానికి కాదని, కేవలం సంభావ్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి సమాజాన్ని సన్నద్ధం చేయడానికేనని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. "రాబోయే ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి తప్ప, ఆదాయం తగ్గిపోతుందని ఆలోచించకూడదు. దేశ ప్రయోజనాలే ముఖ్యం" అని ఆయన పేర్కొన్నారు. ఇంధన పొదుపు వల్ల రాష్ట్రానికి వచ్చే పన్ను ఆదాయం తగ్గవచ్చనే ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. ప్రభుత్వం ఇతర మార్గాల్లో ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తోందని, త్వరలోనే రాష్ట్రానికి రూ. 1.5 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు రాబోతున్నాయని తెలిపారు. ఈ పొదుపు చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐఅండ్‌పీఆర్ శాఖ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

### హిందువులకు క్షమాపణ చెప్పిన

# కమెడియన్ అలీ

హిందూ మత విశ్వాసాలను అవమానించేలా దృశ్యాలు ఉన్నాయంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో అలీ ఈ మేరకు వివరణ ఇచ్చారు.

**అసలేం జరిగిందంటే...!**

ఘర్ సోప్ కోసం రూపొందించిన వాణిజ్య ప్రకటనలో నటుడు అలీ ఒక పూజ గదిలో కూర్చుని, ఒక సబ్బు బిళ్లకు లక్ష్మీ పూజ చేస్తున్నట్లు చిత్రీకరించారు. పూలు, ఇతర పూజా సామగ్రితో సబ్బును ఆరాధిస్తూ, నేపథ్యంలో లక్ష్మీదేవికి సంబంధించిన భక్తి గీతాలు వినిపించడం తీవ్ర అభ్యంతరాలకు దారితీసింది. పవిత్రమైన లక్ష్మీ పూజను ఒక సాధారణ సబ్బు ఉత్పత్తికి వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించడం హిందూ ఆచారాలను అపహాస్యం చేయడమేనని పలు హిందూ సంఘాలు, నెటిజన్లు ఆరోపించారు. ఈ ప్రకటన సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, దానిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. వాణిజ్య ప్రచారం కోసం మతపరమైన నమ్మకాలను కించపరచడం సరికాదంటూ బాయ్‌కాట్ పిలుపులు కూడా వచ్చాయి. దీంతో వివాదం పెద్దది కావడంతో అలీ స్పందించక తప్పలేదు. ఈ నేపథ్యంలో ఒక వీడియో సందేశాన్ని విడుదల చేసిన అలీ, "నా ప్రకటన వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే నన్ను క్షమించండి. ఏ మతాన్ని గానీ, వారి నమ్మకాలను గానీ కించపరిచే ఉద్దేశం నాకు ఎప్పుడూ లేదు," అని విజ్ఞప్తి చేశారు. ఆ యాడ్ ఒక పాత సినిమాలోని సన్నివేశం స్ఫూర్తితో తీశారని, అయినా ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సదరు ప్రకటనను తక్షణమే తొలగించాలని ఘర్ సోప్ యాజమాన్యాన్ని తాను కోరినట్లు అలీ వివరించారు. అలీ క్షమాపణ చెప్పడంతో ఈ వివాదం కొంతవరకు సద్దుమణిగినా, వాణిజ్య ప్రకటనలలో మతపరమైన అంశాల వినియోగంపై ఈ సంఘటన మరోసారి చర్చకు దారితీసింది.

### చట్టాన్ని ధిక్కరించే ధైర్యం

# ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?

చేపడతామని జగన్ హెచ్చరించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు ఆక్వా రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని జగన్ విమర్శించారు. "మీ పరిపాలనలో దోపిడీకి ఏ రంగమూ మినహాయింపు కాదు. చివరకు ఆక్వా ఫీడ్ ధరల విషయంలో కంపెనీలతో కుమ్మక్కై ఆక్వా రైతులను కూడా దోచుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. ఫీడ్ కంపెనీల యాజమాన్యాలు టీడీపీ సానుభూతిపరులని, కమీషన్ల కోసం వారితో చంద్రబాబు లాలూచీ పడ్డారని, అందుకే వారు అడ్డగోలుగా ధరలు పెంచుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉందని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులను సిండికేట్ల నుంచి, దళారుల బారి నుంచి కాపాడేందుకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చి, ముఖ్యమంత్రి చైర్మన్‌గా 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ' (ఏపీఎస్ఏడీఏ)ని ఏర్పాటు చేశామని జగన్ గుర్తుచేశారు. ఈ సంస్థ ద్వారా సీడ్, ఫీడ్ నాణ్యత, ధరలను నియంత్రించడంతో పాటు, ఆక్వా ఉత్పత్తులకు ప్రభుత్వమే ధర నిర్ణయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దీనికితోడు, ఆక్వా రైతులకు యూనిట్ కరెంటును కేవలం రూ. 1.50కే అందించి అండగా నిలిచామని పేర్కొన్నారు. అయితే, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగానే ఏపీఎస్ఏడీఏను నిర్వీర్యం చేసి, తమ ప్రభుత్వ చర్యలన్నింటినీ నీరుగార్చిందని విమర్శించారు. ఏపీఎస్ఏడీఏ అనుమతి లేకుండా కంపెనీలు ధరలు పెంచాయని ప్రభుత్వం ఇప్పుడు చెప్పడం ప్రజల చెవిలో పువ్వులు పెట్టడానికేనని జగన్ ఎద్దేవా చేశారు. "ఒక ప్రభుత్వాన్ని, చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది? వాళ్లు మీవాళ్లు కాబట్టే కదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫీడ్ ధరల పెంపును తాత్కాలికంగా నిలిపివేశామంటూ ప్రభుత్వం మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని హితవు పలికారు. పెంచిన ధరలను పూర్తిగా వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని, రైతుల పక్షాన వైసీపీ అండగా నిలుస్తుందని జగన్ స్పష్టం చేశారు.

# ఢిల్లీలో వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్

గురువారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈ మార్పులు శుక్రవారం నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. మోదీ పొదుపు మంత్రం వేళ.. ఇప్పటికే సీఎం రేఖా గుప్తా తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను నాలుగుకు తగ్గించుకున్నారు. అందులో రెండు విద్యుత్ వాహనాలే.

**ఇంధన ఆదాకు ఢిల్లీ చర్యలు ఇలా..**

ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు వారానికి రెండు రోజులు ఇంటి నుంచి పనిచేయాలి. 50శాతం అధికారిక సమావేశాలు ఆన్‌లైన్‌లో నిర్వహించాలి.

అధికారిక వాహనాల వినియోగాన్ని తగ్గించేలా.. మంత్రిత్వ శాఖ అధికారులు ప్రతి సోమవారం మెట్రోలో ప్రయాణించి ఆఫీసులకు రావాలి. ఇందుకోసం ఉద్యోగుల ప్రయాణ భత్యం 10శాతం పెంపు.

అధికారుల వాహనాలకు ఇచ్చే పెట్రోల్, డీజిల్ నెలవారీ కోటాలో 20శాతం తగ్గింపు. ఆరు నెలల వరకు ఢిల్లీ ప్రభుత్వం ఎలాంటి కొత్త వాహనాల కొనుగోలు చేపట్టొద్దు.

ఏడాది వరకు మంత్రులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ ఎలాంటి విదేశీ పర్యటనలకు వెళ్లొద్దు. మూడు నెలల పాటు ఆర్భాటమైన ప్రభుత్వ కార్యక్రమాలు చేయకూడదు.

ప్రజా రవాణాను ప్రోత్సహించేలా.. ప్రభుత్వ సిబ్బంది నివాసముండే 29 కాలనీలకు 58 ప్రత్యేక బస్సుల నిర్వహణ.

రద్దీని తగ్గించి ఇంధనం ఆదా చేసేలా ప్రభుత్వ కార్యాలయాల పనివేళల్లో మార్పులు చేయాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది.

# వాన్స్ కోసం ట్రంప్ సీక్రెట్ లెటర్..?

ఉపాధ్యక్షుడు వాన్స్ కోసం సీక్రెట్ లెటర్ ఉంచుతారని గోర్క్ పేర్కొన్నారు. ఆ పర్యటనలో తనకు ఏదైనా జరిగితే.. దేశాన్ని ముందుకు నడిపించేందుకు అవసరమైన సమగ్ర సూచనలను అందులో వెల్లడిస్తారన్నారు. ట్రంప్ చైనా పర్యటన నేపథ్యంలో విదేశీ శక్తులు ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకోవచ్చనే ఆందోళనలు నెలకొన్నాయి. అయితే, గోర్క్ వీటిని కొట్టి పడేశారు. వారు ట్రంప్‌ను ఏదైనా చేస్తారనే భయం తనకు లేదని, ఆయన చాలా సురక్షితంగా ఉన్నారన్నారు. ఇదిలాఉండగా.. ట్రంప్‌పై ఇప్పటికే అనేకసార్లు హత్యాయత్నాలు జరిగిన సంగతి తెలిసిందే. 2024లో పెన్సిల్వేనియాలోని ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ ప్రసంగిస్తుండగా.. ఓ యువకుడు ఆయనపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ట్రంప్ కుడి చెవి పైభాగం నుంచి ఓ తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా.. ఓ దుండగుడు ఫెన్సింగ్ వద్దకు తుపాకీతో వచ్చాడు. భద్రతా బలగాలు దీన్ని గుర్తించి అతడిపై కాల్పులు జరిపారు. ఇటీవలే వాషింగ్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో ఓ దుండగుడు కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటన నుంచి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సహా కీలక నేతలు తృటిలో తప్పించుకున్నారు.

**ఒంటరిని అయిపోయాను: వాన్స్**

ట్రంప్‌తో సహా కీలక అధికారులంతా ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్నారు. ప్రస్తుతం వైట్‌హౌస్ బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఉపాధ్యక్షుడు వాన్స్ ఒంటరి అయిపోయినట్లు ఫీల్ అవుతున్నారు. సీక్రెట్ సర్వీస్ ప్రొటోకాల్స్ ప్రకారం.. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు కలిసి విదేశాలకు వెళ్లకూడదు. 'ఇప్పుడు నేను వైట్‌హౌస్‌కి వెళ్లాలి. అక్కడ ఎవరూ ఉండరు. అంతా నిశ్శబ్దంగా ఉంటుంది. అసలు ఏం జరుగుతుందో గ్రహించడానికే నాకు సమయం పడుతుంది' అని విలేకరులతో అన్నారు. ఆయన మాటలకు వారంతా ఒక్కసారిగా నవ్వేశారు. ఈ సందర్భంగా తన పరిస్థితిని ఆయన 1990లో వచ్చిన హోమ్ అలోన్ అనే చిత్రంలోని Macaulay Culkin పాత్రతో పోల్చారు.

# రాజకీయాలకు అతీతంగా అండగా నిలుద్దాం

పదేపదే ప్రస్తావించాను," అని గుర్తు చేసుకున్నారు.

**ఆర్డీటీకి అండగా నిలబడతాం**

"సమాజానికి మంచి చేస్తున్న ఏ సంస్థకైనా ప్రభుత్వం అండగా నిలబడాల్సిన బాధ్యత ఉంది. గతంలో ఆర్డీటీ కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు, నేను వ్యక్తిగతంగా మాంచో గారితో మాట్లాడి, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి కొన్ని అపోహలను తొలగించి, ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ వచ్చేలా చూశాం. వెనుకబడిన జిల్లాను దత్తత తీసుకుని, ఇక్కడి ప్రజలను ప్రేమతో చూస్తున్న ఈ వ్యవస్థకు అండగా నిలబడటం మన బాధ్యత. మున్ముందు కూడా అండగా ఉంటాం. మాంచో గారు తెలుగులో మాట్లాడుతుంటే నేను ఆశ్చర్యపోయాను. తాను పుట్టి పెరిగింది ఇక్కడేనని, 13 ఏళ్ల వరకు తనకు ఇంగ్లీష్ రాదని ఆయన చెప్పడం వారికున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది," అని లోకేష్ వివరించారు.

**సేవలో 0.001 శాతం సాయం నా అదృష్టం**

"ప్రజల సమస్యలు తెలుసుకోవడానికే పాదయాత్ర చేశాను. ఈ క్రమంలోనే ఆర్డీటీ వంటి పవిత్ర సంస్థలకు జీవితాంతం అండగా నిలబడాలని నిర్ణయించుకున్నాను. వారి సేవలో నా వంతు 0.001 శాతం సహాయం చేయగలిగినా అది నా అదృష్టం. ఇక్కడి పీడియాట్రిక్ వార్డులో ఒక తండ్రి తన బిడ్డకు గుండె ఆపరేషన్‌ను ఆర్డీటీ ఉచితంగా చేసిందని చెప్పినప్పుడు, నాపై బాధ్యత మరింత పెరిగింది. అందుకే ముఖ్యమంత్రి గారు కూడా ఇది నా బాధ్యత అని చెప్పారు. తెలుగుజాతి మొత్తం ఆర్డీటీకి అండగా నిలబడాలి. కేవలం రాయలసీమకే పరిమితం కాకుండా, మీ సేవలను రాష్ట్రమంతా విస్తరించండి, మేం అండగా ఉంటామని మాంచో గారిని కోరుతున్నాను," అని లోకేష్ పిలుపునిచ్చారు. కష్టకాలంలో ఓర్పుతో ప్రజలకు సేవ చేసినందుకు మాంచో ఫెర్రర్‌కు లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. దీనిపై స్పందించిన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, "మొదటిసారి మా ఆసుపత్రికి వచ్చిన లోకేష్ గారికి అభినందనలు. ఏడాదిగా మేము ఎన్నో కష్టాల్లో ఉన్నప్పుడు ఆయన మాకు అండగా నిలిచారు. ఆయన సహకారానికి నా కృతజ్ఞతలు," అని అన్నారు.

**లోకేష్‌కు ఘన స్వాగతం.. నెరవేరిన యువగళం హామీ**

మంత్రి హోదాలో తొలిసారిగా బత్తలపల్లి వచ్చిన నారా లోకేష్‌కు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, ఆసుపత్రి హెడ్ డాక్టర్ పి. లలితా దేవి, సిబ్బంది, స్థానికులు ఘన స్వాగతం పలికారు. విదేశీ విరాళాలు నిలిచిపోవడంతో ఆర్డీటీ సేవలకు ఆటంకం ఏర్పడినప్పుడు, యువగళం పాదయాత్రలో లోకేష్ ఆ సంస్థకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్రంతో సంప్రదించి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతులు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే ఆయన పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. పర్యటనలో భాగంగా లోకేష్ మొదట ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం, మాంచో ఫెర్రర్ మాతృమూర్తి అన్నే ఫెర్రర్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డును సందర్శించి, తలసేమియాతో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. సింధూర, గురు లోకేష్ వంటి పిల్లలతో సరదాగా సంభాషిస్తూ వారిలో ధైర్యం నింపారు. చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఎస్. సవిత, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

### వైసీపీ హయాంలో జనాల కష్టాలను

# పట్టించుకోలేదు

గత 40 ఏళ్లుగా చంద్రబాబు అత్యంత నిబద్ధతతో పార్టీని నడిపిస్తున్నారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసే ప్రతి కార్యకర్తకూ పార్టీలో సముచిత గుర్తింపు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యంగా గుంటూరు అభివృద్ధిపై పెమ్మసాని కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ టీడీపీ అధికారాన్ని నిలబెట్టుకుంటే, గుంటూరు నగరాన్ని అమెరికా తరహాలో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా కార్యకర్తలు ఆర్థికంగా స్థిరపడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా దివంగత ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# ఎడ్లబండిపై పోలీసు బరాత్

"ప్రధాని పిలుపు కేవలం ప్రకటన మాత్రమే కాదు. దేశ ప్రయోజనాల కోసం ఇచ్చిన సందేశం. దాన్ని ప్రతి ఒక్కరూ పాటిస్తే ఇంధన ఆదాలో దేశం మరింత బలోపేతమవుతుంది" అని తెలిపారు. కుబేర్ నిర్ణయాన్ని మెచ్చుకుంటూ రాష్ట్రమంత్రి కేదార్ కశ్యప్ ఎక్స్‌లో ఆయన ఫొటోలను షేర్ చేశారు. "ప్రధాని పిలుపు గ్రామాలకు కూడా చేరింది. ఎడ్లబండిపై కుబేర్ బరాత్ నిర్వహించుకోవడం అనేది కేవలం పర్యావరణ పరిరక్షణలో భాగం మాత్రమే కాదు.. మన సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పడమే" అని రాసుకొచ్చారు.

# నెతన్యాహు మా దేశానికి రాలేదు

తావులేదు. అందువల్ల.. యూఏఈ అధికారులు ప్రకటిస్తే తప్ప.. రహస్య పర్యటనలకు సంబంధించి వచ్చే వార్తలన్నీ నిరాధారమైనవే" అని ఎమిరేట్స్ ప్రభుత్వం అధికారిక మీడియాలో వెల్లడించింది. ఈ పర్యటన గురించి నెతన్యాహు కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది. పర్యటన సందర్భంగా నెతన్యాహు, యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌ను కలిసి విస్తృత చర్చల్లో పాల్గొన్నారని కార్యాలయం తెలిపింది. ఈ పర్యటన యూఏఈ, ఇజ్రాయెల్‌ల మధ్య సంబంధాలను పెను మలుపు తిప్పిందని స్పష్టం చేసింది. ఇరాన్ యుద్ధం వేళ ఈ ప్రచారం ప్రాధాన్యం సంతరించుకుంది.

### భారత్ వద్ద ఇప్పటివరకు లేని

# స్టెల్త్ యుద్ధ విమానం

భూమి పూజ జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కలిసి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కీలక కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ కూడా పాల్గొంటారు.

**దేశంలోనే తొలి 5వ తరం యుద్ధ విమానాల తయారీ కేంద్రం**

భారత రక్షణ రంగంలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలవనుంది. ఎందుకంటే, ఇది భారతదేశపు మొట్టమొదటి 5వ తరం స్టెల్త్ మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్. శత్రువుల రాడార్లకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించే స్టెల్త్ టెక్నాలజీ, శబ్ద వేగాన్ని మించిన వేగంతో ప్రయాణించే ట్విన్ ఇంజిన్ సూపర్ క్రూయిజ్ సామర్థ్యం, అత్యాధునిక ఏవియానిక్స్, సెన్సార్లు వంటి ఎన్నో ప్రత్యేకతలతో ఈ యుద్ధ విమానాలను ఇక్కడ అభివృద్ధి చేస్తారు. భారత్‌కు ఇంతవరకు స్టెల్త్ యుద్ధ విమానం లేదు. అది ఇప్పుడు ఏపీలో తయారుకానుండడం దేశ రక్షణ రంగ చరిత్రకే తలమానికం వంటి ఘట్టం. అత్యంత కీలకమైన విషయం ఏమిటంటే, ఈ యుద్ధ విమానాలను పుట్టపర్తిలోనే అభివృద్ధి చేసి, ఇక్కడే టెస్టింగ్ కూడా చేపట్టేలా ప్రాజెక్టును సమగ్రంగా రూపొందించారు. రూ.15,803 కోట్ల భారీ పెట్టుబడితో, 650 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. ఏఎంసీఏ స్టెల్త్ యుద్ధ విమానం సిద్ధమైతే భారత్... అమెరికా, రష్యా, చైనా వంటి అగ్రరాజ్యాల సరసన సగర్వంగా నిలుస్తుంది.

**సీమ యువతకు ఉపాధి... భారీగా అనుబంధ పరిశ్రమలు**

ఈ మెగా ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా సుమారు 7,500 మందికి నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. అంతేకాకుండా, ఈ ప్రధాన ప్రాజెక్టుకు అనుబంధంగా వచ్చే ఏరోస్పేస్, డిఫెన్స్ సంబంధిత ఇతర యూనిట్ల ద్వారా దాదాపు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అనుబంధ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా మరో 400 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. దీనికి సమాంతరంగా కర్నూలు జిల్లాలో నిర్మిస్తున్న 'డ్రోన్ సిటీ' ద్వారా భారతదేశంలోనే అత్యుత్తమ డ్రోన్ ఎకోసిస్టమ్‌ను సిద్ధం చేసే పనిలో ప్రభుత్వం నిమగ్నమై ఉంది.

**మరో 12 ప్రాజెక్టులకు శ్రీకారం**

ఏఎంసీఏ ప్రాజెక్టుతో పాటు రక్షణ, డ్రోన్ రంగాలకు చెందిన మరో 12 కీలక ప్రాజెక్టులకు కూడా శుక్రవారం శంకుస్థాపన జరగనుంది. వీటిలో 4 డిఫెన్స్ ప్రాజెక్టులు, 8 డ్రోన్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ 12 ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి రూ.4,145 కోట్ల పెట్టుబడులు, 6,071 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. మడకశిరలో రెండు, దొనకొండ, నెల్లూరుల్లో ఒక్కో డిఫెన్స్ ప్రాజెక్టు ఏర్పాటు కానుండగా, మిగిలిన 8 డ్రోన్ ప్రాజెక్టులు కర్నూలు డ్రోన్ సిటీలో కొలువుదీరనున్నాయి.

**శంకుస్థాపన చేస్తున్న డిఫెన్స్ ప్రాజెక్టులు**

కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ -రూ. 1430 కోట్ల పెట్టుబడి - 565 మందికి ఉపాధి

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ - రూ. 489 కోట్ల పెట్టుబడి - 500 మందికి ఉపాధి

ఎఖీజూ - రూ. 1040 కోట్ల పెట్టుబడి - 870 మందికి ఉపాధి

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ - రూ. 500 కోట్ల పెట్టుబడి - 2050 మందికి ఉపాధి

**కర్నూలు డ్రోన్ సిటీలో రానున్న ప్రాజెక్టులు**

అల్గోబాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ. 34 కోట్ల పెట్టుబడి - 52 మందికి ఉపాధి

డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ. 255 కోట్ల పెట్టుబడి - 850 మందికి ఉపాధి

డ్రోన్ ల్యాబ్ టెక్నాలజీస్ - రూ. 5 కోట్ల పెట్టుబడి - 14 మందికి ఉపాధి

హెచ్ సి రోబోటిక్స్ - రూ. 100 కోట్ల పెట్టుబడి - 500 మందికి ఉపాధి

సెన్స్ ఇమేజ్ టెక్నాలజీస్ - రూ. 68 కోట్ల పెట్టుబడి - 45 మందికి ఉపాధి

ఎయిర్ పేస్ ఇండస్ట్రీస్ - రూ. 100 కోట్ల పెట్టుబడి - 150 మందికి ఉపాధి

జేడీకే ఫ్లై డ్రోన్ వరల్డ్ - రూ. 114 కోట్ల పెట్టుబడి - 350 మందికి ఉపాధి

లాట్రిక్ ఎయిరో స్పేస్ - రూ. 10 కోట్ల పెట్టుబడి - 125 మందికి ఉపాధి

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉదయం 08:15 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి, ఉదయం 09:45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఉదయం 10:15 గంటలకు శంకుస్థాపన కార్యక్రమ వేదిక వద్దకు వస్తారు. ఉదయం 10:15 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఏఎంసీఏ ప్రాజెక్టుతో పాటు ఇతర డిఫెన్స్, డ్రోన్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి భూమి పూజ చేస్తారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 02:20 గంటలకు తిరిగి అమరావతికి పయనమవుతారు.

## ఎడిటర్ వాయిస్

# నెల్లూరు 'మహానాడు'కు పొదుపు దెబ్బ? చంద్రబాబు నిర్ణయంపై సస్పెన్స్!

నెల్లూరులో టీడీపీ మహానాడుపై సస్పెన్స్ నెలకొంది. ఈ నెల 27 నుంచి 29 వరకు మహానాడు నిర్వహణకు టీడీపీ అధిష్టానం ఏర్పాట్లు చేస్తోంది. అయితే చమురు సంక్షోభం నేపథ్యంలో మహానాడు వంటి భారీ కార్యక్రమం నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహానాడు నిర్వహణకు టీడీపీ సర్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, నైతికంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలో పడినట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రస్తుత పరిస్థితుల్లో పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని మోదీ పిలుపునివ్వడంతోపాటు స్వయంగా ఇంధన పొదుపునకు పూనుకున్నారు. అదేసమయంలో ప్రధాని సూచనలతో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పొదుపు చర్యలను అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిస్థితుల్లో భారీగా ఖర్చయ్యే మహానాడు నిర్వహణపై సీఎం పునరాలోచనలో పడినట్లు చెబుతున్నారు. ఇలాంటి లక్షలాది మందితో మహానాడు నిర్వహిస్తే విమర్శలకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందని టీడీపీ అధిష్టానం పునరాలోచనలో పడినట్లు చెబుతున్నారు.

రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే కార్యకర్తలు, నాయకుల కోసం భారీగా రవాణా ఏర్పాట్లు చేయడంతోపాటు భోజనాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో అధినేత చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఉత్కంఠతో కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. మరోవైపు మహానాడు నిర్వహణ ఆనవాయితీగా వస్తుండటంతో వాయిదా వేసే అవకాశం లేదని కూడా అంటున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహించే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు.

ఏటా మే నెలలో టీడీపీ మహానాడు నిర్వహిస్తుంది. ప్రతి ఏటా ఇదో పెద్ద పండుగలా నిర్వహించడం టీడీపీ ఆనవాయితీ. ఈ క్రమంలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు నెల్లూరులో మహానాడు నిర్వహించాలని పార్టీ ముందుగా నిర్ణయించింది. యువనేత నారా లోకేశ్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా నిర్వహించే మహానాడును ఘనంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దాదాపు 19 కమిటీలతో శరవేగంగా పనులు చేస్తున్నారు. చరిత్రలో కనివినీ ఎరుగనట్లు మహానాడు సక్సెస్ చేస్తామని బుధవారమే మంత్రులు, పార్టీ నేతలు ప్రకటించారు. అయితే అదే రోజు రెండు రోజుల్లో ప్రభుత్వ పరంగా కీలక నిర్ణయాలు ఉంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో మహానాడు నిర్వహణపై ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఉత్కంఠ రేపుతోంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## నాటు తుపాకీతో కాల్చుకుని యువకుడి ఆత్మహత్య



**లింగంపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓ యువకుడు నాటు తుపాకీతో కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నాడు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం మోతెలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తిలిపితీయా ఇంద్రజిత్ సింగ్ (28) ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులను బయటకు పంపివేసి గదిలోకి వెళ్లాడు. తన వద్ద ఉన్న నాటు తుపాకీతో ఛాతీపై కాల్చుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త మరణవార్త విని తట్టుకోలేకపోయిన ఇంద్రజిత్ సింగ్ భార్య తీవ్ర మనస్తాపంతో గ్రామ సమీపంలోని కుడికుంటలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడు కాల్చుకున్న నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు లింగంపేట ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు.

## తీవ్ర విషాదం.. పెళ్లిదండలతోనే నవ వధువు మృతి..



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** పెళ్లి సందడితో కళకళలాడిన ఆ కుటుంబాల్లో ఒక్కసారిగా తీవ్ర విషాదం నెలకొంది. విశాఖలోని అగనంపూడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వాడచీపురుపల్లికి చెందిన నరసింగరావుకు అగనంపూడికి చెందిన రామేశ్వరితో బుధవారం రాత్రి వివాహమైంది. వాడచీపురుపల్లిలోని వరుడి ఇంటి వద్ద పెళ్లి జరిగింది. గురువారం మధ్యాహ్నం అక్కడి నుంచి నూతన దంపతులతో పాటు మరో నలుగురు అంగనంపూడికి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో అగనంపూడి సమీపంలో కారు అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వధువు రామేశ్వరి మృతిచెందగా.. వరుడు నరసింగరావు, పెళ్లికుమార్తె తల్లి కనక మహాలక్ష్మి, సోదరి వరలక్ష్మితో పాటు వారితో ఉన్న బాలుడు నంద కిశోర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో కనక మహాలక్ష్మి పరిస్థితి విషమంగా ఉంది. పెళ్లిదండలతో ఉండగానే వధువు మృతిచెందడం స్థానికులను కలచివేసింది. ఈ ప్రమాదం ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

## బంగారం కోసం చేతులు, కాళ్లు కట్టేసి.. మహిళ దారుణహత్య

**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని అక్కయ్యపాలెం పరిధిలో మహిళ దారుణహత్యకు గురయ్యారు. శ్రీనివాసనగర్‌లో బంగారు ఆభరణాల కోసం పార్వతి (50) అనే మహిళను దుండగులు చంపేశారు. ఆమె చేతులు, కాళ్లు కట్టేసి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. బీరువా తాళాల కోసం మహిళను చిత్రహింసలు పెట్టారు. లాకర్ పగలగొట్టి అందులోని బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఘటనాస్థలికి ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు చేరుకుని పరిశీలించారు. బుధవారమే పార్వతి హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చినట్లు గుర్తించారు.

## డీసీఎంను తప్పించబోయి కొబ్బరిబోండాల లారీ బోల్తా



**వడియారం, విశ్వం వాయిస్ న్యూస్ :** మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం బైపాస్ సర్కిల్ వద్ద లారీ బోల్తా పడింది. బెంగళూరు నుంచి ఉత్తరప్రదేశ్‌కు వెళుతున్న కొబ్బరి బోండాలతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న డీసీఎంను తప్పించబోయి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అనురాగ్ యాదవ్ గాయపడ్డాడు. అతడిని స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## కానిస్టేబుల్‌ను పెళ్లి చేసుకుంటానని మోసం.. కూకట్‌పల్లిలో ఎస్సై అరెస్టు



**మూసాపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళలకు రక్షణగా ఉండాల్సిన సబ్ ఇన్‌స్పెక్టర్ గతి తప్పాడు. పెళ్లై ఇద్దరు పిల్లలున్నా తన వద్ద పనిచేసే మహిళా కానిస్టేబుల్‌ను ప్రేమ పేరుతో మోసగించాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఎస్సైని కూకట్‌పల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. 2018 బ్యాచ్‌కు చెందిన సన్నెదాన సురేశ్(38) ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నాడు. ఇటీవల వరకు కొల్లూరు ఠాణాలో ఎస్సైగా విధులు నిర్వర్తించాడు. 2020 నుంచి 2023 ఫిబ్రవరి వరకు కూకట్‌పల్లి ఠాణాలో ఎస్సైగా పనిచేశాడు. ప్రేమపేరుతో అదే ఠాణాలో రైటర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్‌ను లోబర్చుకున్నాడు. ఆమెకు గర్భస్రావం చేయించాడు. పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చిన ప్రతిసారి దాటవేస్తూ వచ్చాడు. ఇటీవల కొల్లూరు ఠాణాకు వెళ్లి నిలదీస్తే అప్పటి నుంచి విధులకు రాలేదు. బాధితురాలు కూకట్‌పల్లి ఠాణాలో ఏప్రిల్ 1న ఫిర్యాదు చేశారు. విషయం తెలిసిన ఉన్నతాధికారులు ఎస్సై సురేశ్‌ను సైబరాబాద్ కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి, 45 రోజుల పాటు సస్పెన్షన్ విధించారు. ఇన్ని రోజులుగా పరారీలో ఉన్న సురేశ్‌ను బుధవారం అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు.

ప్రేమజంట పెళ్లి వ్యవహారం..

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ఐ



**భీమవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ పి.నాగరాజు, కానిస్టేబుల్ బాలకృష్ణ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ ప్రేమ జంట పెళ్లి వ్యవహారంలో ఎస్ఐ బెదిరించి రూ.70 వేలు లంచం అడిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో.. గురువారం లంచం డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ప్రస్తుతం తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్నారు.

## లేడీస్ హాస్టల్ భవనంపై మృతదేహం

### గుంటూరు జిల్లాకు చెందిన మహిళగా గుర్తింపు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పంజాగుట్ట డివిజన్ మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. మధురానగర్‌లోని భార్గవి లేడీస్ హాస్టల్ భవనం పైభాగంలో ఉన్న టెర్రస్‌లో నివసిస్తున్న హారిక (40) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. టెర్రస్‌పై ఉన్న బాత్రూంలో ఆమె మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మధురానగర్ పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. హారిక మృతి చెంది రెండు రోజులు అయి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతురాలి స్వస్థలం గుంటూరు జిల్లాగా గుర్తించారు. టెర్రస్‌పై ఒంటరిగా నివసిస్తున్న హారిక బాత్రూంలో పడిపోయి మృతి చెందినట్టుగా అనుమానిస్తున్న పోలీసులు, అసలు కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నేపాలీ ముఠా దోచింది

## 60 తులాల బంగారం 20 కిలోల వెండి కూడా..

### విశ్రాంత ప్రొఫెసర్ దంపతులను కట్టేసి ఘాతుకం



**జవహర్‌నగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ ఠాణా పరిధిలో నేపాలీ ముఠా విశ్రాంత ప్రొఫెసర్ దంపతులను కట్టేసి నగలు, నగదు దోచుకెళ్లిన ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాతనేరస్థులు నేపాల్‌కు చెందిన మీనా కడాయత్ ఎలియాస్ మమత(32), ఆమె భర్త రమేశ్ (35) ప్రధాన సూత్రధారులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. 2023లో మొయినాబాద్ ఠాణా పరిధిలో ఇదే విధంగా దోపీడీకి పాల్పడి జైలుకెళ్లినట్లు గుర్తించారు. తాజాగా జవహర్‌నగర్ ఠాణా పరిధిలోని గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో వృద్ధ దంపతులు విశ్రాంత ప్రొఫెసర్ ఎన్.మురళీమోహన్(68), డాక్టర్ విజయలక్ష్మి(58) ఇంట్లో ఏప్రిల్ 24న పనిలో చేరారు. వారి ఇంట్లోనే ఉంటూ నమ్మకంగా పనిచేస్తున్నారు. ఈనెల 11న రాత్రి మీనా తన పుట్టినరోజు జరుపుకొంటానని, బంధువులను పిలిపించుకుంటానని మురళీమోహన్ దంపతులను నమ్మించింది. ఈ క్రమంలో మరో జంట వారి ఇంటికొచ్చింది. జన్మదిన వేడుకలు జరుపుకొంటున్నట్లు నటిస్తూ ప్రొఫెసర్ దంపతులు భోజనం చేస్తుండగా వెనుక నుంచి చేతులు వెనక్కి కట్టేశారు. వారివద్ద ఆయుధాలుండడంతో ఆందోళన చెందిన దంపతులు 'మమ్మల్ని ఏమీ చేయకండి.. మీకు ఏం కావాలో తీసుకోవాలని' వేడుకున్నారు. వెంటనే గదుల్లోకి వెళ్లి దాదాపు 60 తులాల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి, రూ.30 వేల నగదు, ద్విచక్రవాహనం దోచుకున్నారు. తర్వాత దంపతులను గదిలోకి తీసుకెళ్లి తాళ్లతో చేతులు కట్టేసి మురళీమోహన్‌కు మత్తుపదార్థాన్ని బలవంతంగా తాగించి అన్ని గేట్లకు తాళాలు వేసి పరారయ్యారు. మంగళవారం మధ్యాహ్నం మురళీమోహన్ కిటికీలో నుంచి అరవడంతో అటుగా వచ్చిన వ్యక్తి గుర్తించి తలుపులు తీశారు. దోపీడీలో 5 నుంచి ఏడుగురు వరకు పాల్గొన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 6 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టినట్లు మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు.




## అన్నం తిన్నాక పండ్లు తింటే ఏమవుతుంది..?

మీ బాడీలో ఏం జరుగుతుందో తెలిస్తే షాకే..



పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అందరికీ తెలుసు. కానీ మీరు వాటిని తినే సమయం మీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని మీకు తెలుసా? చాలామంది భోజనం ముగిశాక డెజర్ట్‌గా పండ్లను తింటుంటారు. అయితే ఇది అమృతమా లేక జీర్ణవ్యవస్థకు శాపమా? భోజనం తర్వాత వెంటనే పండ్లు తింటే కడుపులో ఏం జరుగుతుంది? అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నది కాదనలేని సత్యం. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే పండ్లు మనల్ని రోగాల నుండి రక్షిస్తాయి. అయితే చాలామంది భోజనం ముగిసిన తర్వాత డెజర్ట్ లాగా పండ్లను తింటుంటారు. మరి ఇలా భోజనం తర్వాత వెంటనే పండ్లు తినడం సరైనదేనా? దీనివల్ల జీర్ణవ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుంది? ఆరోగ్య నిపుణులు ఏమంటున్నారో వివరంగా తెలుసుకుందాం.

### ఎందుకు జాగ్రత్తగా ఉండాలి?

సాధారణంగా పండ్లలో ఉండే సహజ చక్కెరలు, ఫైబర్ చాలా త్వరగా జీర్ణమవుతాయి. కానీ మనం తినే భారీ భోజనంలోని ప్రోటీన్లు, కొవ్వులు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. భోజనం తర్వాత వెంటనే పండ్లు తింటే, అవి జీర్ణకోశంలో భోజనంతో కలిసిపోయి జీర్ణ ప్రక్రియను మందగింపజేస్తాయి. దీనివల్ల కొంతమందిలో గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా ఐబీఎస్ లేదా ఫ్రక్టోజ్ అసహనం ఉన్నవారు భోజనం తర్వాత పండ్లు తింటే అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉంది.

### పోషకాలు అందవా? అపోహలు vs వాస్తవాలు

భోజనంతో పాటు పండ్లు తింటే పోషకాలు అందవని చాలామంది నమ్ముతుంటారు. కానీ ఇందులో నిజం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మానవ జీర్ణవ్యవస్థ ఆహారం నుండి గరిష్ట పోషకాలను గ్రహించేలా రూపొందించబడింది. చిన్న ప్రేగు చాలా పొడవుగా ఉండి, పోషకాలను నెమ్మదిగా, సమర్థవంతంగా గ్రహిస్తుంది. కాబట్టి భోజనం తర్వాత పండ్లు తిన్నా పోషకాల లోపం ఏర్పడదు.

### జీర్ణక్రియకు తోడ్పడే సూపర్ పండ్లు

అన్ని పండ్లు భోజనం తర్వాత ఇబ్బంది కలిగించవు. కొన్ని పండ్లు జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. బొప్పాయి, పైనాపిల్‌లో ఉండే ఎంజైమ్‌లు మనం తిన్న ఆహారంలోని ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడతాయి. కివి, బెర్రీలు కూడా భోజనం తర్వాత సులభంగా జీర్ణమై, శరీరానికి మేలు చేస్తాయి.

### నిపుణుల సలహా

మీకు జీర్ణ సంబంధిత సమస్యలు ఏవీ లేకపోతే భోజనం తర్వాత పండ్లు తీసుకోవచ్చు. అయితే పండ్ల నుండి పూర్తి ప్రయోజనం పొందాలనుకుంటే, భోజనానికి గంట ముందు లేదా రెండు గంటల తర్వాత తీసుకోవడం ఉత్తమ వ్యూహమని నిపుణులు సూచిస్తున్నారు.

## మల్టీవిటమిన్ తీసుకోవడం మంచిదా.. చెడ్డదా..?

నిపుణులు ఏం చెబుతున్నారంటే..?




పని ఒత్తిడి, అనారోగ్యకరమైన జీవనశైలి, పెరుగుతున్న ఫాస్ట్ ఫుడ్ వినియోగం కారణంగా, చాలా మంది వారి ఆహారంలో అవసరమైన పోషకాలను పొందడం లేదు. అందువల్ల, కొంతమంది వారు తాము స్వయంగా మల్టీవిటమిన్లను తీసుకోవడం ప్రారంభించారు. కొందరు దీన్ని రోగనిరోధక శక్తి పెంచడానికి, అలసట తగ్గించడానికి, లేదా శక్తిని పొందడానికి ఉపయోగిస్తారు. నేటి ఉరుకులు పరుగుల జీవనశైలిలో చాలా మందికి తమ ఆహారంపై సరైన శ్రద్ధ పెట్టడం కష్టంగా మారింది. ఫలితంగా, శరీరానికి అవసరమైన పోషకాలను అందించడానికి మల్టీవిటమిన్ల వైపు ఆసక్తి పెరుగుతుంది. మల్టీవిటమిన్లు అనేవి విటమిన్లు A, B, C, D, E, ఇనుము, కాల్షియం, జింక్ వంటి వివిధ విటమిన్లు, నిజాలను కలిగిన సప్లిమెంట్లు. ఇవి శరీరంలో పోషక లోపాలను భర్తీ చేయడంలో సహాయపడతాయి. సాధారణంగా, ఆహారం అసమతుల్యంగా ఉన్నప్పుడు లేదా విటమిన్/ఖనిజ లోపం ఉన్నప్పుడు వైద్యులు మల్టీవిటమిన్లను సిఫార్సు చేస్తారు. పని ఒత్తిడి, అనారోగ్యకరమైన జీవనశైలి, పెరుగుతున్న ఫాస్ట్ ఫుడ్ వినియోగం కారణంగా, చాలా మంది వారి ఆహారంలో అవసరమైన పోషకాలను పొందడం లేదు. అందువల్ల, కొంతమంది వారు తాము స్వయంగా మల్టీవిటమిన్లను తీసుకోవడం ప్రారంభించారు. కొందరు దీన్ని రోగనిరోధక శక్తి పెంచడానికి, అలసట తగ్గించడానికి, లేదా శక్తిని పొందడానికి ఉపయోగిస్తారు.

### రోజువారీ మల్టీవిటమిన్ తీసుకోవడం మంచిదా?

RML హాస్పిటల్‌లో మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి దీనిపై స్పందించారు. ప్రతీ ఒక్కరికీ రోజువారీ మల్టీవిటమిన్ అవసరం ఉండదు. సమతుల్యమైన ఆహారం (పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, పప్పు, ప్రోటీన్) తీసుకుంటే, శరీరం సాధారణంగా అవసరమైన విటమిన్లు, ఖనిజాలను పొందుతుంది. కాబట్టి, రోజువారీ మల్టీవిటమిన్ తప్పనిసరి కాదు, అది ఖచ్చితంగా అవసరమైన సందర్భాల్లో మాత్రమే తీసుకోవాలని సూచించారు. కొన్ని విటమిన్లు అధికంగా తీసుకుంటే శరీరానికి హానికరం అవుతాయి. కాబట్టి, మల్టీవిటమిన్లను వైద్య సలహాతో మాత్రమే తీసుకోవడం మంచిది, ముఖ్యంగా పోషక లోపం ఉన్నవారికి.

### ఎవరు మల్టీవిటమిన్లు తీసుకోవాలి?

అసమతుల్య ఆహారం తీసుకునేవారు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే స్త్రీలు, కొన్ని వైద్య పరిస్థితులు ఉన్నవారు, దీర్ఘకాలిక అలసట, బలహీనత లేదా పోషకాహార లోపం ఉన్నప్పుడు కూడా వైద్యులు సప్లిమెంట్లను సిఫార్సు చేస్తారు. కానీ, ప్రతి వ్యక్తి అవసరాలు భిన్నంగా ఉంటాయి, కాబట్టి మల్టీవిటమిన్లు ప్రారంభించే ముందు వైద్యుని సంప్రదించడం మంచిది.

### ముఖ్యమైన సూచనలు

మల్టీవిటమిన్లు సమతుల్య ఆహారం ప్రత్యామ్నాయంగా ఉండకూడదు. పండ్లు, ఆకుపచ్చ కూరగాయలు, ధాన్యాలు, పప్పు, పాలు వంటి సహజ ఆహారాలు శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలను అందిస్తాయి. సప్లిమెంట్లు సురక్షితంగా ఉండటానికి, సరైన మోతాదులో, సరైన సమయంలో మాత్రమే తీసుకోవాలి.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శుక్రవారం, 15 మే, 2026




www.viswamvoice.com




## స్వచ్ఛతపై ప్రచారంలో ఘనం..

# ఆచరణలో కానరాని వైనం..



సమస్యపై అధికారులకు తమ గోడు వినిపిస్తున్న దళితకాలనీ వాసులు

- చెత్త నిర్వహణ ప్రచారం.. కాలువ గట్టుపై దహనమే పరిష్కారమా..?
- ప్రచారంలో పరిశుభ్రత.. వాస్తవంలో పట్టని భాద్యత
- చెత్తకు నిప్పు పెట్టి ప్రజారోగ్యానికి ముప్పు తెస్తున్న వైనం
- ప్రజల ఊపిరిని బలి తీసుకుంటున్న గ్రామ పంచాయతీ నిర్లక్ష్యం

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గ్రామాలలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని, తడి చెత్తతో కంపోస్ట్ తయారీ, పొడి చెత్తలో ప్లాస్టిక్ వంటి పదార్థాల రీసైక్లింగ్ ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాల పరిశుభ్రతను మెరుగుపర్చాలని ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రమైన రాయవరం గ్రామంలో పంచాయతీ అధికారులు చెత్త నిర్వహణ పేరుతో అవలంబిస్తున్న విధానాలు స్థానిక ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామమంతటి నుండి సేకరించిన చెత్తను తుల్యభాగా నది గట్టు వెంబడి భారీగా పేరబెట్టి ప్రతిరోజూ దానికి నిప్పు అంటించడం వలన దగ్గర్లో ఉన్న ప్రాంతాలు పొగతో కమ్ముకుపోతున్నాయి. ముఖ్యంగా సమీప దళితవాడ ప్రజలు శ్వాసకోశ సమస్యలు, కళ్ల మంటలు, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చెత్త నుండి సంపద తయారీ ఎక్కడ.?**

గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నట్లు పంచాయతీ ప్రచారం చేస్తున్నప్పటికీ, చివరకు మొత్తం వ్యర్థాలను ఒకేచోట కుప్పగా వేసి తగలబెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ఈ విషయమై అధికారులను ప్రశ్నించగా ఎస్ డబ్ల్యూ పిసి ద్వారా సంపద సృష్టించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పడం పరిపాటి.

**పొంచి ఉన్న పెను ప్రమాదం**

ప్లాస్టిక్, గృహ వ్యర్థాలు, వైద్య వినియోగ వస్తువులు కలిసిన చెత్తను బహిరంగంగా దహనం చేయడం వల్ల విషపూరిత వాయువులు వెలువడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం వేళ చెత్తకు నిప్పంటించడంతో దట్టమైన పొగ గ్రామాన్ని కమ్మేస్తోందని, వృద్ధులు, చిన్నారులు ఊపిరి పీల్చుకోవడానికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితులు చెబుతున్నారు. "చెత్తను శాస్త్రీయంగా నిర్వహించాల్సిన పంచాయతీ, సమస్యను కాల్చేసి ముగించాలనే ధోరణితో వ్యవహరిస్తోంది" అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇంత పెద్ద స్థాయిలో కాలుష్యం జరుగుతున్నప్పటికీ సంబంధిత పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం. ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్న ఈ అంశాన్ని అధికారులు పట్టించుకోకపోవడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తుల్యభాగా నది గట్టు పరిసర ప్రాంతాలు క్రమంగా చెత్త మైదానాలుగా మారిపోతుండటంతో వెడల్పైన నది ప్రవాహం చెత్తతో పూడుకుపోయి, వరదల సమయంలో పెనుప్రమాదం సంభవిస్తుందని మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన పంచాయతీ వ్యవస్థే ఇప్పుడు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే చెత్త దహనాన్ని నిలిపివేసి, శాస్త్రీయ వ్యర్థ నిర్వహణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

తుల్యభాగా గట్టు వద్ద చెత్త దహనం జరుగుతున్న విషయాన్ని పరిశీలిస్తున్నాం. ఇకపై చెత్తకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకుంటాం. గ్రామంలో చెత్త నిర్వహణకు శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక డంపింగ్ యార్డ్ స్థలం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీనిపై సంబంధిత అధికారులకు విషయం తెలియచేశాము. త్వరలో సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతాం



**ఎమ్. శ్రీనివాసరావు**
**డిప్యూటీ ఎంపీడీవో, రాయవరం**

తుల్యభాగా గట్టు వద్ద చెత్త దహనం జరుగుతున్న అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. గ్రామం అంతటి నుండి సేకరించిన చెత్తకు పంచాయతీ శానిటేషన్ సిబ్బంది నిప్పు పెట్టడం సరైన విధానం కాదు. ఇకపై ఇలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడతాం. ప్రజారోగ్యానికి ఇబ్బంది కలిగించే అంశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు



**బి.వి. భాస్కర్**
**మండల రెవెన్యూ అధికారి, రాయవరం.**

నిర్దేశిత గడువులో

# జనగణన పూర్తి చేయాలి

**కమీషనర్ టీవీ రంగారావు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** జనగణన-2027 మొదటి విడతలో భాగంగా జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని మండపేట మున్సిపల్ కమీషనర్ రంగారావు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని 110 హెచ్ఎల్‌బి బ్లాకులకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన ఇండ్ల గణన పురోగతిని సమీక్షించారు. స్వచ్ఛ సర్వేక్షన్-2027, సిటిజెన్ పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ సర్వేలను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వార్డు సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబల సంఖ్య, మౌలిక వసతుల వివరాలు మాత్రమే సేకరిస్తారని స్పష్టం చేశారు. ఆధార్, రేషన్ కార్డు వివరాలు, ఓటీపీలు అడగరని తెలిపారు. జనగణన సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో మునిసిపల్ డి ఈ శ్రీనివాస్, ఆర్ ఓ మాచిరాజు రవి, శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి రమ్యశ్రీ, ఆర్ఐ కొత్తపల్లి సత్తిబాబు, ఏఇలు దాసరి పవన్ అనూష స్వర్ణ వార్డు మేనేజర్ దంటు శ్రీనివాస్, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సినిమాల్లో ఆ ఒక్క మార్పు చేయండి : మంత్రి దుర్గేష్



సినీ దర్శకులకు ఏపీ మంత్రి దుర్గేశ్ కీలక సూచన చేశారు. తమ సలహా పాటించే వారికి అవసరమైన సహకారం అందజేస్తామని ఆఫర్ చేశారు. ఇంతకీ మంత్రి చేసిన సూచన ఏంటంటే.. ఇకపై తెలుగు సినిమాల్లో షూటింగ్ లోకేషన్ పేర్లను కూడా తెరపై ప్రదర్శించాలని, అలా చేయడం వల్ల ఏపీలో అందమైన లోకేషన్లపై ప్రజలకు సమాచారం ఇవ్వడంతోపాటు టూరిజం అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి కల్పన జరుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఏపీ పర్యాటక రంగం అభివృద్ధికి సినిమా పరిశ్రమ ఒక శక్తివంతమైన సాధనంగా మారాలని మంత్రి కందుల దుర్గేశ్ కోరారు. రాష్ట్రంలోని అందమైన లోకేషన్లను ప్రపంచానికి పరిచయం చేయడంలో దర్శకులు కీలక పాత్ర పోషించాలని మంత్రి దుర్గేశ్ ఆకాంక్షించారు. సాధారణంగా సినిమాల్లో అందమైన ప్రదేశాలను చూసినప్పుడు ప్రేక్షకులు అవి ఎక్కడ ఉన్నాయో? తెలుసుకోడానికి ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలోనే మంత్రి దుర్గేశ్ చిత్ర దర్శకులకు ఒక సరికొత్త సూచన చేశారు. సినిమాలో ఏదైనా సీన్ వస్తున్నప్పుడు, ఆ షూటింగ్ జరిగిన ప్రాంతం పేరును తెరపై ప్రదర్శించాలని కోరారు. దీనివల్ల ఆయా ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

**చిన్న మార్పు పెద్ద ప్రయోజనం!**

మంత్రి సూచనలతో సినీ దర్శకులు చేసే చిన్నమార్పు వల్ల మంచి ప్రయోజనాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఏపీలో చాలా ప్రాంతాలు సినిమా షూటింగులకు అనుకూలంగా ఉంటుంది. వైజాగ్, అరకు, కోనసీమ ప్రాంతం, మారేడుమిల్లి, శేషాచలం అడవులలో ఎక్కువగా షూటింగులు జరుగుతుంటాయి. అయితే ఇప్పటివరకు ఆయా ప్రాంతాల అందాలను తెరపై చూసి ఆనందించడమే కానీ, ప్రేక్షకులు వాటి వివరాలను తెలుసుకోలేకపోయేవారు. కానీ, మంత్రి సూచన అమలు చేస్తే సినిమా చిత్రీకరించిన ప్రాంతం ఎక్కడ ఉందో ప్రేక్షకులు తెలుస్తుంది. దీంతో వారు ఆ ప్రాంతాన్ని సందర్శిస్తే పర్యాటక అభివృద్ధి జరుగుతుందని, తద్వారా స్థానికులకు ఉపాధి కలుగుతుందని అంటున్నారు.

**అలా చేస్తే సహకారం**

ఆంధ్రప్రదేశ్‌లో షూటింగ్స్ జరుపుకునే చిత్రాలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని, దర్శకులు తమ సినిమాల్లో ఏపీ లోకేషన్లకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి కోరారు. కేవలం అందమైన విజువల్స్ మాత్రమే కాకుండా, అవి ఏ ప్రాంతానికి చెందినవో చెప్పడం ద్వారా ఆ ప్రదేశాల అభివృద్ధికి దర్శకులు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. మంత్రి చేసిన ఈ వినూత్న ప్రతిపాదనపై సినీ రంగం ఎలా స్పందిస్తుందో చూడాలి. ఒకవేళ ఇది అమలైతే, భవిష్యత్తులో మన ఏపీలోని కోనసీమ అందాలు, అరకు లోయలు, రాయలసీమ కోటలు వెండితెరపై మరింత స్పష్టంగా ప్రపంచానికి పరిచయం కావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# క్యాన్సర్ పసిగట్టే పరికరం - పేద రోగులకు కూటమి వరం

ఏపీలో పేదలు మధ్యతరగతి వర్గాల కోసం కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ వంటి రోగాల బారిన పడుతూ నానా అవస్థలకు గురి అవుతున్న వారి కోసం అత్యాధునిక పెట్ స్కాన్ ని సిద్ధం చేసింది. గుంటూరు జీజీహెచ్ లో అత్యాధునిక పెట్ స్కాన్ ని అందుబాటులో ఉంచారు. అమెరికా నుంచి తెప్పించిన పెట్ స్కాన్ వ్యయం అక్షరాలా 18 కోట్ల రూపాయలు. శరీరంలో ఏ మూలన ఉన్నా కూడా క్యాన్సర్ గుట్టును పసిగట్టే ఈ పెట్ స్కాన్ ని ప్రభుత్వాసుపత్రులలో ఏర్పాటు కావడం ఇదే తొలిసారి కావడం విశేషం.



**కార్పొరేట్ సదుపాయం :** ఏపీలో పెట్ స్కాన్ అన్నది ఉంది కేవలం కార్పోరేట్ ఆసుపత్రులలో మాత్రమే. ఆ విధంగా ఈ అత్యాధునిక పెట్ స్కాన్ సదుపాయం ప్రస్తుతం రాష్ట్రంలో పద్దెనిమిది ప్రైవేట్ కార్పొరేటు ఆసుపత్రులలో అందుబాటులో ఉంది. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం వంటి చోట్ల ప్రైవేట్ ఆసుపత్రుల లో ఉన్న ఈ సౌకర్యాన్ని పేదలకు అందించాలన్న ఆలోచనను కూటమి ప్రభుత్వం చేసింది. అందుకే గుంటూరులోని ప్రభుత్వ బోధనాసుపత్రిలో దానిని ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల పేద, మధ్యతరగతి రోగులకు క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన అత్యుత్తమ వైద్యాన్ని ఉచితంగా అందుకునేందుకు వీలు అవుతుంది.

**కీలక మైలురాయి :** నిజానికి ఏపీలో క్యాన్సర్ వైద్యంలో ఇదొక మైలురాయి కాబోతుందని వైద్య నిపుణులు కూడా చెబుతున్నారు. ఈ కార్పొరేట్ అసుపత్రులలో పెట్ స్కాన్ ద్వారా పరీక్షలు చేయించుకునే వారి నుంచి సగటున 20 వేల రూపాయల వరకూ నగదుని తీసుకుంటున్నారు. అదే గుంటూరు జీజీహెచ్ ఆవరణలో ఉన్న నాట్కో క్యాన్సర్ కేంద్రంలో పెట్ స్కాన్ పరీక్షలు చేయించుకున్న వారి నుంచి ఎటువంటి ఫీజు తీసుకోరు. పూర్తి ఉచితంగా ఇవన్నీ లభిస్తాయి. ఇక గుంటూరు జీజీహెచ్ లోని నాట్కో క్యాన్సర్ కేంద్రంలో ఇప్పటికే 41 కోట్లతో అత్యాధునిక వైద్య పరికరాలు సమకూర్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా లెవల్-1 స్థాయిలో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దేందుకు ఇప్పటికే లినాక్, హెచ్ఎఆర్ బ్రాకీ థెరపీ, సి.టి స్టిమ్యులేటర్ వంటి అత్యాధునిక సర్జికల్ పరికరాల్ని ప్రభుత్వం సమకూర్చింది. ఈ క్రమంలోనే యూఎస్ఏ నుంచి పెట్ స్కాన్ ను తెప్పించింది. లేటెస్ట్ గా ట్రయల్ రన్ విధానంలో దీని పనితీరును నిశితంగా వైద్య బృందాలు పరిశీలించాయి. ఈ పెట్ స్కాన్ ద్వారా ఇప్పటి వరకూ యాభై మంది రోగులను పరీక్షించారు

**క్యాన్సర్ కణం ఎక్కడ ఉన్నా :** శరీరంలో క్యాన్సర్ కణం ఎక్కడున్నా కచ్చితంగా గుర్తించేందుకు ఈ పెట్ స్కాన్ ఉపయోగపడుతుంది. దీని సాయంతో క్యాన్సర్ ఏ దశలో ఉంది ఎక్కడెక్కడికి విస్తరించిందనేది స్పష్టం తెలుసుకోవడానికి వీలు కలుగుతుంది. సీటీ స్కాన్ లో ఎముకలు, ఎంఆర్ఐలో కణజాలం కనిపిస్తాయి. పెట్ స్కాన్ లో క్యాన్సర్ కణితిని కచ్చితంగా నిర్ధారించి చుట్టుపక్కల అవయవాలన్నీ ప్రభావితం కాకుండా అందులో ఏ ప్రాంతానికి ఎంత రేడియేషన్ ఇవ్వాలో కూడా కచ్చితత్వంతో కూడిన వైద్యాన్ని వైద్యులు నిర్ణయిస్తారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో :** క్యాన్సర్ రోగులు పడుతున్న ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకుని నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 15 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక క్యాన్సర్ కేంద్రాన్ని నాలుగున్నరేళ్ల కిందట ఇక్కడ నిర్మించారు ఈ కేంద్రంలో రేడియేషన్ ఆంకాలజీ, సర్జికల్, మెడికల్, న్యూక్లియర్, ప్రివెంటివ్ అంకాలజీ, పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్ సర్వీసెస్ కూడా ప్రారంభమయ్యాయని చెబుతున్నారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- ⚡ బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- 🌎 అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- 📊 విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.





ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ రద్దు చేయడం

# న్యాయవ్యవస్థ నిర్ణయం హర్షణీయం

ప్రజా సంఘాలు



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** దళిత యువకుడు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యాన్ని అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడైన ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్‌ను రాజమండ్రి ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు రద్దు చేయడం పట్ల పీడీఎస్‌యూ, ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అధికార, రాజకీయ బలంతో న్యాయం నుండి తప్పించుకోవచ్చనే ధీమాతో ఉన్న నిందితుడికి ఈ తీర్పు ఒక గట్టి సమాధానమని బెదిరింపులకు గురవుతున్న బాధిత కుటుంబానికి ఇది ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వి.భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ పేర్కొన్నారు. అయితే కేసు ఇంకా ముగియలేదని, హైకోర్టు వెంటనే విచారణను వేగవంతం చేసి నిందితుడికి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కఠిన శిక్ష విధించాలని వారు డిమాండ్ చేశారు. నిందితుడి వర్గం నుండి బాధిత కుటుంబానికి ఎలాంటి ప్రాణహాని కలగకుండా ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని అలాగే వారికి ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలవాలని కోరారు. దళితులపై దాడులు చేసే విషయంలో ప్రభుత్వం, న్యాయవ్యవస్థ రాజీ పడకుండా వ్యవహరించాలని ఇలాంటి అమానుష ఘటనలు సమాజంలో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు స్పష్టం చేశారు.

రామచంద్రపురం ఆర్టీసీ బస్టాండ్‌లో

# ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

డిప్యూటీ సూపరింటెండెంట్ షేక్ ఇబ్రహీం సేవా దృక్పథం అభినందనీయం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ఆర్టీసీ బస్టాండ్‌లో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు గ్యారేజీ విభాగం డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీ షేక్ ఇబ్రహీం సాహెబ్ ఆధ్వర్యంలో గురువారం చల్లటి మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మే 14, 2026న జరిగిన ఈ కార్యక్రమంలో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులతో పాటు ఆర్టీసీ కుటుంబ సభ్యులకు కూడా రుచికరమైన మజ్జిగను అందజేశారు. సూర్యుని ప్రచండ తాపం నుండి ప్రజలను రక్షించే ఉద్దేశంతో "ప్రతి మంచి పని ఒక దానంతో సమానం" అనే స్ఫూర్తితో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. నిత్యం వేల సంఖ్యలో ప్రయాణించే ప్రయాణికుల పట్ల మానవతా దృక్పథంతో స్పందించి వారి దాహార్తిని తీర్చిన షేక్ ఇబ్రహీంకి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

బాలుకు సంఘీభావంగా

# భారీ నిరసన కార్యక్రమం

పోలీసు వేధింపులు ఆపాలని వైసీపీ యువజన నాయకుల డిమాండ్




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపు మేరకు, కర్నూలు సిటీ యువజన విభాగం అధ్యక్షుడు బాలు పై టీడీపీ ప్రభుత్వం, పోలీసుల వేధింపులు, అక్రమ కేసులను నిరసిస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు నియోజకవర్గాల యువజన విభాగం అధ్యక్షులు, మండల, గ్రామ, వార్డు స్థాయి యువజన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని బాలు కు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నాయకులు, యువజన నాయకులపై అక్రమ కేసులు, పోలీసు వేధింపులు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. కర్నూలు యువజన నాయకుడు బాలు పై నమోదైన తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలని, ఆయనపై జరుగుతున్న పోలీసు వేధింపులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం నాయకులు, ఏడు నియోజకవర్గాల యువజన అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది విద్యార్థుల ఎన్రోల్మెంట్‌ను 10 శాతం పెంచాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. బడి పిలుస్తోంది ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా రాష్ట్ర పరిశీలకురాలు రమ్యశ్రీ ఆధ్వర్యంలో రావులపాలెంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు నిర్దేశిత లక్ష్యాలకు చేరువగా ఉన్నట్లు సమీక్షలో వెల్లడైందన్నారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని, విద్య యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఇంటికి చేరవేయడమే బడి పిలుస్తోంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. "ప్రతి చిన్నారి బడిలోకి ప్రతి కుటుంబంలో విద్యా చైతన్యం" లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా కార్యక్రమం కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



మార్పులు తీసుకువస్తోందని, బడి పిలుస్తోంది ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను విజయ వంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రచార రథాల ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ 100 శాతం ఎన్రోల్మెంట్ సాధించేందుకు కృషి చేయాలన్నారు. బడి ఈడు పిల్లలందరినీ గుర్తించి, వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది తీసుకోవాలన్నారు. ఏ చిన్నారి కూడా చదువుకు దూరం కాకుండా ఇంటింటికీ తిరిగి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అభివృద్ధి చెందాయని తెలిపారు. డిజిటల్ విద్య, ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీల ద్వారా నాణ్యమైన బోధన అందుతోందన్నారు. ఈ సౌకర్యాలపై తల్లిదండ్రులకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఎస్‌సీ ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో పార్ట్‌టైమ్ టీచర్లు, ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యా రథాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ ప్రక్రియను ఉత్సాహభరితంగా నిర్వహించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న విద్యా చైతన్య ర్యాలీలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు.

# ఆక్వా రైతుల సమస్యలపై భారీ నిరసన

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం హైస్కూల్ సెంటర్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన, అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ నేతృత్వంలో జరిగిన ఈ నిరసన అనంతరం నాయకులు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్వా రైతులకు కనీస గిట్టుబాటు ధర లభించక తీవ్ర నష్టాలు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం ఈ విషయంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పెరిగిన సాగు ఖర్చులు, విద్యుత్ ఛార్జీలు, మార్కెట్‌లో ధరల పతనం కారణంగా రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతులు ఆత్మహత్యల దిశగా వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని, రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి

జిల్లా కలెక్టర్‌కు వినతి



ఇజ్రాయిల్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు గన్నవరపు సూర్యనారాయణరావు, పాముల రాజేశ్వరీ దేవి, గొల్లపల్లి సూర్యారావు, ఒంటెద్దు వెంకన్న నాయుడు, కంఠంశెట్టి ఆదిత్య, కుడుపూడి భరత్ భూషణ్, వైసీపీ నాయకులు మట్టపర్తి నాగేంద్ర, విత్తనాల ఇంద్రశేఖర్, చింతా రామకృష్ణ, తోరం గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# చల్లపల్లిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు - అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామంలో అంతర్జాతీయ మేధావి, భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో సమానత్వం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బొత్స బాధ్యతలు ఆమెకు..?

విజయనగరం జిల్లాకు చెందిన బీసీ నేత బొత్స సత్యనారాయణ విషయంలో ఇపుడు ఒకటి ప్రచారంలో ఉంది. ఆయన రాజకీయాల నుంచి నెమ్మదిగా తప్పుకుంటారు అని అంటున్నారు. బొత్స వయసు కూడా దాదాపుగా ఏడు పదులకు చేరువ అవుతోంది. ఆయన అనారోగ్య సమస్యలతో తరచూ ఇబ్బంది పడుతున్నారు. ఈ మధ్యనే




ఆయన ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. బడ్జెట్ సెషన్ లో కూడా బొత్స శాసన మండలిలో మాట్లాడుతూ ఒక దశలో తూలిపడబోయిన సందర్భం కూడా అంతా చూశారు. దాంతో పాటుగా బొత్స కుటుంబీకులు అయితే ఆయనను క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండాలని కోరుతున్నారని అంటున్నారు.

**బొత్సకు అయితే అలా :** ఇక బొత్స విషయం తీసుకుంటే ఆయనకు రాజకీయాలు అంటే ఇష్టం. కొనసాగాలనే ఉంది. పైగా తన వారసులను 2029 ఎన్నికల్లో నిలబెట్టి గెలిపించుకోవాలని ఉందని అంటున్నారు. జిల్లా రాజకీయాలనే కాదు ఉత్తరాంధ్రాలోనే శాసించిన బీసీ నేతగా ఒక కీలకమైన నాయకుడిగా బొత్స కనిపిస్తారు. ఆయన కాంగ్రెస్ లో పుట్టి పెరిగారు. ఉమ్మడి ఏపీలో పీసీసీ చీఫ్ గా కూడా పనిచేశారు. ఇక విభజన తరువాత కాంగ్రెస్ నుంచి పోటీ చేసి మంచి ఓట్లు సాధించారు. అయితే ఆ తరువాత పరిణామాల నేపథ్యంలో ఆయన వైసీపీలో చేరారు. అలా 2019లో విజయనగరం జిల్లా మొత్తం వైసీపీ స్వీప్ చేసింది. దానికి బొత్స కృషి రాజకీయ వ్యూహాలు కారణం అని చెబుతారు. బొత్స 2024 ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి పోటీ చేసి టీడీపీ సీనియర్ నేత కిమిడి కళా వెంకట్రావు చేతిలో ఓటమి పాలు అయ్యారు. ఆ తరువాత ఆయనకు విశాఖ జిల్లా స్థానిక సంస్థల కోటాలో జరిగిన ఉప ఎన్నికల్లో జగన్ అవకాశం ఇవ్వడంతో ఎమ్మెల్సీ అయ్యారు. ఆ వెంటనే శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడుగా కూడా అయ్యారు. ఆయన ఎమ్మెల్సీ పదవీ కాలం 2027 డిసెంబర్ దాకా ఉంది. అంతవరకూ ఆయన విపక్ష నేత హోదా కూడా ఉంది. అయితే ఆరోగ్య కారణాల వల్ల బొత్స ఆ పదవిని తాను నిర్వహించలేనని జగన్ కి చెప్పారని అంటున్నారు. అంతే కాదు ఆయనకు గోదావరి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ గా పార్టీ బాధ్యతలు అప్పగించింది. వాటి విషయంలోనూ ఆయన చేయలేనని చెప్పారని అంటున్నారు.

**ఉత్తరాంధ్రకే మళ్ళీ :** అయితే లండన్ నుంచి తిరిగి వచ్చిన జగన్ ప్రస్తుతం బిజీగా ఉన్నారు. పార్టీ నాయకులతో తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆయన భేటీ అవుతున్నారు. వర్తమాన రాజకీయాల గురించి కూడా ఆయన వాకబు చేస్తూ అందరితోనూ చర్చలు జరుపుతున్నారు. ఆ మీదట ఆయన బొత్స సత్యనారాయణ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంటారు అని అంటున్నారు. బొత్స ఉత్తరాంధ్ర నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందువల్ల శాసన మండలిలో ప్రతిపక్ష నాయక పదవిని అదే ప్రాంతానికి అదే బీసీ సామాజిక వర్గానికి ఇవ్వాలని వైసీపీ అధినాయకత్వం ఆలోచన చేస్తోంది అని అంటున్నారు. అదే కనుక జరిగితే అనకాపల్లి జిల్లాకు చెందిన రాష్ట్ర వైసీపీ మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణికి ఈ పదవిని ఇస్తారని అంటున్నారు. ఆమె శాసనమండలిలో అధికార పక్షాన్ని గట్టిగా నిలదీస్తున్నారు అని అంటున్నారు. దాంతో పాటుగా ఆమె పట్ల పార్టీ అధినాయకత్వం పూర్తి సుముఖంగా ఉందని చెబుతున్నారు. మొత్తం మీద బొత్స కనుక క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటే మాత్రం ఉత్తరాంధ్రాలో వైసీపీకి తీరని లోటుగానే చెప్పాల్సి ఉంటుంది అని అంటున్నారు.

ప్రజల ప్రాణరక్షణే

# కూటమి ప్రభుత్వ బాధ్యత

వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచన



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత వడగాల్పుల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. హీట్ వేవ్ పరిస్థితులు తీవ్రమవుతున్నందున ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. వేసవిలో చిన్న నిర్లక్ష్యం కూడా ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉన్నందున శరీరంలో నీటి శాతం తగ్గకుండా తరచూ మంచినీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అనవసరంగా బయట తిరగవద్దని ఎండలో వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా తలకు గుడ్డ కట్టుకోవాలని తెలిపారు. శరీరంలో అలసట, కళ్లు తిరగడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని మంత్రి పేర్కొన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తికి తక్షణమే చికిత్స అందించడం అత్యంత ముఖ్యమని మంత్రి వివరించారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ఉన్న చల్లని ప్రదేశానికి లేదా ఏసీ, ఫ్యాన్ ఉన్న గదిలోకి తరలించాలని తెలిపారు. బాధితుడి ఒంటిపై ఉన్న దుస్తులను వదులు చేసి తడి గుడ్డతో శరీరాన్ని మెడ నుండి పాదాల వరకు తుడవాలని ఐస్ ప్యాక్లు అందుబాటులో ఉంటే చంకలు, గజ్జలు, మెడ భాగంలో ఉంచడం ద్వారా శరీర ఉష్ణోగ్రతను తగ్గించవచ్చని సూచించారు. బాధితుడు స్పృహలో ఉంటేనే మంచినీరు లేదా ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలని, స్పృహ లేని పక్షంలో నోటి ద్వారా ఏమీ ఇవ్వకూడదని హెచ్చరించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉన్నా లేదా పరిస్థితి విషమిస్తున్నా ఆలస్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి తరలించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు.

న్యాయమూర్తి వి.నాగేశ్వరరావు నాయక్‌కు

# ఘనంగా వీడ్కోలు

రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కారం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం జూనియర్ సివిల్ జడ్జ్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్ బదిలీపై కొవ్వూరు కోర్టుకు వెళ్తున్న సందర్భంగా, రామచంద్రపురం బార్ అసోసియేషన్ హాల్లో గురువారం సాయంత్రం ఆయనను ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు మాట్లాడుతూ న్యాయమూర్తి నాగేశ్వరరావు నాయక్ జూనియర్ న్యాయవాదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపే వారని గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులకు ప్రాక్టీస్‌లో మెళకువలు నేర్పించడమే కాకుండా సీనియర్ల ద్వారా వారికి తగిన అవకాశాలు లభించేలా ప్రోత్సహించడం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం సీనియర్ న్యాయవాదులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, పలివెల సత్యనారాయణ, అల్లం గనిరాజు, ముసిని సర్వారాయుడు, దొమ్మలపాటి సత్యనారాయణ, ఎస్.బి.ఎస్.కె. కుమారస్వామి, ఆర్.ఆర్.కె, నేలపాటి వీరభద్రరావు, సూరంపూడి గంగాధరం, వెలగల నరేందర్ రెడ్డి, బి.వి. ప్రసాద్‌లు మాట్లాడుతూ నాగేశ్వరరావు నాయక్ అందించిన న్యాయ సేవలను ప్రశంసించారు. ఈ వీడ్కోలు సభలో సీనియర్ సివిల్ జడ్జ్ ఎమ్. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి నిజం శారద, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం మధుసూదన్ రావుతో పాటు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ మరియు మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

50 ఏళ్లు దాటిన బీసీలకు తక్షణమే

# పింఛన్లు మంజూరు చేయాలి

నియోజకవర్గ ఎంబిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు డిమాండ్



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామలో ఎం.బి.సి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ కొత్త పింఛన్ల ఊసే లేకపోవడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతో పాటు ముఖ్యంగా 50 ఏళ్లు దాటిన బీసీ కులాల వారు ప్రభుత్వం ఎప్పుడు పింఛన్ ఇస్తుందా అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు కొత్త పింఛన్లకు సంబంధించి దరఖాస్తులు కూడా స్వీకరించకపోవడం శోచనీయమని నాగేశ్వరరావు అన్నారు. పింఛన్ ఆశతో కొంతమంది లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు మరికొంతమంది గ్రామ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారుల నుండి ఎటువంటి స్పందన లభించడం లేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. 50 ఏళ్లు దాటిన ప్రతి బీసీ వ్యక్తికి తక్షణమే పింఛన్ మంజూరు చేయాలని అర్హులైన వారందరికీ న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



### పదవ తరగతి టాపర్లను

# సన్మానించిన ప్రత్తిపాడు జనసేన



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గంలోని మండల కేంద్రం రౌతులపూడి జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 500 పైగా మార్కులు సాధించిన మండలంలోని రౌతులపూడి, ములగపూడి, బలరామపురం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్.అగ్రహారం, ఎ.మల్ల వరం... ఆరు గ్రామాలకు చెంది 31 మంది విద్యార్థులను నియోజకవర్గం జనసేన పార్టీ గురువారం ఉదయం ఘనంగా సన్మానించింది. కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సూచనలతో నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్య కిరణ్ (బాబి) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు శాలువాలను కప్పి, పుష్ప గుచ్ఛాలను ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సన్మానితులకు కాలేజీ, ఉన్నత చదువులకు ఉపయోగపడే విధంగా కాలేజ్ బ్యాగులు, లంచ్ బాక్సులు, స్టీల్ వాటర్ బాటిల్స్, జ్ఞాపికలనూ బహూకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి, తుని ప్రాంతం ఆత్మ సంఘం ఉప అధ్యక్షుడు కరణం సుబ్రహ్మణ్యం, జనసేన జిల్లా కార్యదర్శి పెంటకోట మోహన్, శంఖవరం, ఏలేశ్వరం మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు గాబు సుభాష్, దాసం శేషారావు, శంఖవరం మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తలపంటి బుజ్జి, ఏలేశ్వరం మండల పార్టీ ఉపాధ్యక్షులు పలివెల వెంకటేష్, ఆత్మ ప్రాంతీయ సంఘం సభ్యులు మాగాపు వీరబాబు, రౌతులపూడి మండల విద్యాశాఖాధికారి గాడి కొండబాబు, రౌతులపూడి జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ షేక్ సలీమ్, అధిక సంఖ్యలో జన సైనికులు పాల్గొన్నారు.


# 43 దళిత కుటుంబాలు దళిత పెద్దలతో బహిష్కరణ..?



### పది నెలల నుండి అసలేం జరుగుతుంది..

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కూలి పనికి వెళ్ళనివ్వరు కిరాణా కొట్టు వద్ద సరుకులు ఇవ్వనివ్వరు గ్రామంలో జరుగు కార్యక్రమాలలో భాగస్వాములను చేయనివ్వరు వివాహాది శుభకార్యాలకు భోజనాలకు పిలవరు వరి కోత మిషన్ చే కోతలు కోయ్యనివ్వరు దారిన వెళుతుంటే చోటు ఇవ్వరు ఎలా 43 కుటుంబాలను మానసికంగా గ్రామ పెద్దలు ఇబ్బందులు పెడుతున్న సంఘటన కాకినాడ జిల్లా తల్లారేవు మండలం పోలేకుర్రు గ్రామపంచాయతీ, తోటపేట గ్రామంలో చోటు చేసుకుంది. వీరు ఎటువంటి తప్పు చేయలేదు గ్రామంలో జరుగుతున్న అన్యాయాలు అక్రమాలను ప్రశ్నించి పోలీసులను చట్టాలను ప్రభుత్వ అధికారులను ఆశ్రయించినందుకే గ్రామ పెద్దలు వెలివేసి పక్కన పెట్టారు. ఈ విషయంపై కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, కాకినాడ రూరల్ సీఐ, కోరంగి పోలీస్ స్టేషన్ ఎస్ఐ, తాళ్లరేవు తహసిల్దార్లు ను కలసి ఫిర్యాదు చేయడం జరిగింది. పోలీసులు ప్రభుత్వ అధికారులు ఇరువు వర్గాలను తమ కార్యాలయాలకు పిలిపించి ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇవ్వ గా గ్రామ పెద్దలు రేపటి నుంచి ఏ గొడవలు లేకుండా మేము అందరం కలిసిమెలిసి బ్రతుకుతామని మేము అందరూ ఒకే కులమని మేమంతా ఒకే కుటుంబానికి చెందిన వాళ్ళమని వాళ్ల దగ్గర చెబుతూ అధికారులు చేసే తీర్మానాల మీద సంతకాలు చేస్తూ , మేమంతా కలసి మెలిసి బ్రతుకుతామని ఎవరిని ఇబ్బంది పెట్టమని చెప్పుకుంటూ వస్తున్నారు. గ్రామంలోకి వచ్చిన తరువాత వాళ్ల పనులను మరల మొదటకు తీసుకొచ్చి వెలి ని గ్రామంలో పటిష్టంగా అమలు చేస్తున్నారు. ఇలా పది నెలలు కావస్తున్న ఈ సమస్య కాగితాలకే పరిమితమైంది తప్ప ఎటువంటి పరిష్కారానికి నోచుకోలేదని వేలి బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు నేతలు దీనిని ఆసరాగా తీసుకొని మా గ్రామంలో జరుగుతున్నటువంటి కార్యక్రమాలను వెలి బాధితులు అడ్డుకుంటున్నారని మరో వర్గానికి తప్పుడు ప్రచారం చేస్తున్నట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి సంబంధించి ప్రోగ్రామ్స్ ను కొందరు తమ పవర్ తో నిలిపివేసి ఆ ప్రచారాన్ని వెలి బాధితుల మీద నెట్టడం సబబు కాదని బాధితులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెలి బాధితులకు న్యాయం చేయకుంటే 43 కుటుంబాలకు చెందిన పిల్ల పీత ఆడ మగ అందరూ కలిసి తాళ్లరేవు తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామని వెలి బాధితులు తెలియజేశారు.

# గవర్నమెంట్‌లోనూ వర్క్ ఫ్రం హోమ్..



ప్రధాని మోదీ సూచనల మేరకు దేశ ప్రజలు అంతా పొదుపు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చిన సీఎం చంద్రబాబు వర్క్ ఫ్రం హోంపై ఆసక్తికర ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ప్రధాని మోదీ సూచనల మేరకు దేశ ప్రజలు అంతా పొదుపు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చిన సీఎం చంద్రబాబు వర్క్ ఫ్రం హోంపై ఆసక్తికర ప్రకటన చేశారు. వర్క్ ఫ్రం హోం అనేది రియాలిటీ. ప్రపంచం మొత్తం ఇంటి నుంచే పనిచేసే పరిస్థితి వస్తుంది. దీనిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వివరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల్లోనే తన ప్రభుత్వం కీలక ప్రకటన చేయనుందని వెల్లడించారు. అమరావతిలోని బొల్లినేని మెడికల్ సైన్స్ అండ్ స్కిల్ సెంటర్ కు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోదీ చెప్పిన 8 పొదుపు చర్యలను పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గల్ఫ్ యుద్ధం, చమురు సంక్షోభం నేపథ్యంలో పొదుపు మంత్రాన్ని పాటించాలని ప్రధాని మోదీ రెండు రోజుల క్రితం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. డీజిల్, పెట్రోల్ వినియోగం తగ్గించడంతోపాటు వంట గ్యాస్, వంట నూనెల వినియోగంపై ప్రధాని కీలక సూచనలు చేశారు. బంగారం కొనుగోలు నిర్ణయాన్ని ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. దీనిపై తాజాగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలు అంతా దేశం కోసం బాధ్యత వహించాలని, ప్రధాని పిలుపునిచ్చిన పొదుపు చర్యలను పాటించాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓ కార్యాచరణ ప్రకటిస్తుందని వెల్లడించారు. యుద్ధ పరిస్థితుల వల్ల దేశంపై భారం పడుతోందని సీఎం వ్యాఖ్యానించారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతోపాటు పౌరులు కూడా బాధ్యతగా ఉండాలని, తాత్కాలికంగా వచ్చే ఇబ్బందులు అధిగమించాలని సీఎం సూచించారు. ఈ క్రమంలోనే వర్క్ ఫ్రమ్ హోమ్ పై సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంలోనూ ఈ తరహా విధానాన్ని అమలు చేసే పరిస్థితులు వస్తున్నాయని తెలిపారు.

**వర్క్ ఫ్రం హోం సాధ్యమా?**

గవర్నమెంటులోనూ వర్క్ ఫ్రం హోం విధానం తీసుకువస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. కోవిడ్ ఎఫెక్ట్ తో ఐటీతోపాటు మరికొన్ని రంగాల్లో వర్క్ ఫ్రం హోం విధానం అమలు చేసిన విషయం తెలిసిందే. ఐటీ సెక్టార్ లో ఇప్పటికీ కొన్ని సంస్థలు ఈ విధానాన్ని అమలు చేస్తుండగా, గత ఏడాది నుంచి కొన్ని కంపెనీలు వర్క్ ఫ్రం హోం విధానానికి స్వస్తి చెప్పాయి. అయితే తాజా పరిస్థితులతో రవాణా ఖర్చులు భారంగా మారడంతో మళ్లీ వర్క్ ఫ్రం హోం విధానంవైపు మళ్లేలా ప్రయత్నాలు మొదలు అయ్యాయని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కూడా వర్క్ ఫ్రం హోం పాటిస్తుందంటూ సీఎం చంద్రబాబు చేసిన సూచనలు ఆసక్తికరంగా మారాయి. ప్రభుత్వంలో పలు విభాగాలు ఉండగా, ఏ విభాగాలలో ఈ పద్ధతి ప్రవేశపెట్టే అవకాశం ఉందన్న చర్చ ఎక్కువగా జరుగుతోంది. దీనిపై రెండు రోజుల్లోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పడంపై సర్వత్రా ఆసక్తికర చర్చ జరుగుతోంది.

# మాటిచ్చారు.. నిలబెట్టారు..

### డిప్యూటీ సీఎం పవన్‌పై గిరిపుత్రుల హర్షం



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌పై గిరిపుత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా ఏడాది కిందట ఇచ్చిన హామీని వడివడిగా నెరవేర్చడంపై వారు హర్షాతి రేకాలు వ్యక్తం చేస్తుండడం గమనార్హం. ఉమ్మడి విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న మన్యం ప్రాంతంలో తాజాగా అధునాత హంగులతో కూడిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించారు. దీనిలో విద్యార్థుల కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేకంగా టాయ్‌లెట్లతో పాటు ఆడుకునే మైదానం.. క్రీడాపరికరాలు.. గణితానికి సంబంధించిన ల్యాబులు కూడా ఏర్పాటు చేశారు. అయితే.. సాధారణంగా ఇప్పటి వరకు గిరిజన ప్రాంతా ల్లో పర్యటించిన నాయకులు హామీలు గుప్పించడమే తప్ప... పనిచేసిన వారు చాలా చాలా తక్కువ మం ది ఉన్నారు.కానీ, వీరికి భిన్నంగా పవన్ కల్యాణ్.. గత ఏడాది ఏప్రిల్‌లో గిరిజన ప్రాంతమైన పెదపాడులో పాఠశాల నిర్మాణం చేస్తామని ఇచ్చిన హామీని కేవలం ఏడాది కాలంలోనే నెరవేర్చారు. దీనిపై గిరిజన సంఘాలు.. నాయకులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కేంద్రం గిరిజన నిధులతో..**

కేంద్రం కేటాయిస్తున్న సాస్కీ నిధులతోపాటు.. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకు కేటాయించే నిధులతో పెదపాడులో అధునాతన పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనిలో సుమారు 300 మంది విద్యార్థులు చదువుకునేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే.. ప్రస్తుతం 120 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని అధికారులు తెలిపారు. పాఠశాలలోనే మినీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి.. పుస్తకాలను కూడా పవన్ కల్యాణే సమకూర్చారని చెప్పారు. ఈ నిర్మాణానికి సుమారు 18 లక్షల రూపాయలు ఖర్చయినట్టు వెల్లడించారు.

**గిరిజనులపై మమకారం..**

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తరచుగా గిరిజనులపై మమకారం ప్రదర్శిస్తున్నారు. ఆయన పర్యటించిన ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించారు. కొన్ని ప్రాంతాల్లో గిరిజనులకు పండ్లు పంపించడంతోపాటు వారికి పాదరక్షలు కూడా పంపించారు. గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం కూడా ప్రాధాన్యంగా తీసుకున్నారు. ఇలా.. ఏ చిన్న అవకాశం వచ్చినా.. గిరిజనులపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మమకారం చూపిస్తున్నారు.

# ఆయనతో పని చేయడం కష్టం...

### మంత్రి నారా లోకేష్ కామెంట్స్ వైరల్!




మంత్రి నారా లోకేష్ అటు పార్టీలో అత్యంత ప్రముఖ స్థానంలో ఉంటూ రాటుతేలుతున్నారు. ఇటు తనకు అప్పగించిన మంత్రిత్వ శాఖల విషయంలోనూ పట్టుదలగా పరిశ్రమిస్తూ నూటికి నూరు శాతం న్యాయం చేస్తున్నారు. తండ్రి చంద్రబాబు ఎంతటి పని మంతుడో లోకేష్ కూడా అంతే ధీటుగా పోటీగా ఎదుగుతున్నారు. ఎక్కడా విసుగూ విరామం అన్నది లేకుండా బాబుతో సమానంగా నారా లోకేష్ పనిచేస్తూ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకుంటున్నారు. గడచిన రెండేళ్ల కాలంలో లోకేష్ మంత్రిగా ఎక్కడా రాజీ పడని ధోరణిలోనే ముందుకు సాగుతున్నారు. అలుపూ సొలుపూ అన్నది దరి చేయనీయకుండా లోకేష్ పని చేస్తున్న తీరు నిజంగా అంతటా చర్చనీయాంశంగా ఉంది.

**సంతోషంగా ఉండనీయరు :** లోకేష్ చాలా సందర్భాలలో చంద్రబాబు పనితీరు ఆయన ఇతరుల నుంచి ఆశించే విధానం అన్నీ చెబుతూ వస్తున్నారు. చంద్రబాబుకు పనిమంతులు అంటే ఇష్టం. ఆయనకు ఉమ్మడి ఏపీ సీఎంగా ఒక పేరు ఉంది. ఆయన నిద్రపోరూ అవతల వారిని నిద్రపోనీయరు అని. అలాగే ఆయన పనిచేస్తారు, ఇతరులను కూడా పని చేయకపోతే అసలు వదలరు, మరి కుమారుడు రేపటి పార్టీ సారథి అయిన లోకేష్ విషయంలో బాబు స్పేర్ చేస్తారా అంటే అసలు కుదరదు అనే అంటారు. అదే విషయాన్ని మంత్రి లోకేష్ తాజాగా సిఐఐ నిర్వహించిన ఎస్ఎంఈ ఐపిఓ అవగాహన సదస్సులో మాట్లాడుతూ చెప్పారు. తాము ఏదైనా సాధిస్తే మమ్మల్ని ఐదు నిమిషాలు కూడా చంద్రబాబు సంతోషంగా ఉండనివ్వరని లోకేష్ ఈ సందర్భంగా సరదాగా చేసిన వ్యాఖ్యలు అంతా చర్చించుకుంటున్నారు.

**రిలాక్స్ అన్న మాటే లేదు :** చంద్రబాబుతో కలసి పనిచేయడంలో పోటీ పడాల్సిందే అని లోకేష్ చెప్పారు. తాము ఎక్కడ విశ్రాంతి తీసుకుంటామోనని ఎప్పుడూ మాకు ఏదో ఒక పని అప్పగిస్తునే ఉంటారని లోకేష్ చెప్పుకొచ్చారు. అందుకే చంద్రబాబుతో పని చేయడం చాలా కష్టం సుమా అని కూడా అనేశారు. బాబుకు పని తెలుసు. పట్టుదల కూడా తెలుసు అని ఆయన గురించి లోకేష్ ఒక సక్సెస్ స్టోరీని కూడా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం తెలిపారు. చంద్రబాబు హెరిటేజ్‌కు ముందు చేసిన మూడు ప్రయత్నాలు విఫలమయ్యాయని అయినా బాబు ఎక్కడా వెనక్కి తగ్గలేదని చెప్పారు. అలా ఆయన 34 సంవత్సరాల పాటు చేసిన విశేషమైన కృషితోనే ఈ రోజున హెరిటేజ్ సంస్థ ఎదిగిందని అన్నారు. అలా ఆ సమ్మను బాబు ఎంతగానో విజయవంతం చేశారని అన్నారు. ఒక్క రాత్రిలో హెరిటేజ్ ఈ స్థితిలో లేదని, అది అంచెలంచెలుగా ఎదిగింది అని లోకేష్ గుర్తు చేశారు. అందుకే

**బాబు ముందు చూపుతోనే :** చంద్రబాబు అంటేనే విజన్ అని లోకేష్ చెప్పారు. చంద్రబాబు ఎపుడూ మూడు దశాబ్దాల ముందు చూపుతో ఉంటారని అన్నారు. హైదరాబాద్‌లో ఐటీ అని బాబు అంటే కంప్యూటర్లు కూడు పెడతాయా అని ఆనాడు అవహేళన చేశారని ఫ్లాష్ బ్యాక్ గురించి లోకేష్ చెప్పారు. కానీ ఈ రోజున అదే హైదరాబాద్ ఏ స్థాయిలో ఉందో అంతా చూస్తున్నారని అన్నారు. అలానే ఇంటికో పారిశ్రామికవేత్త లక్ష్యాన్ని కూడా బాబు పట్టుదలతో చేస్తున్న ప్రయత్నంగా లోకేష్ చెప్పారు. దీనిని కూడా ఏపీ సాధిస్తుందని ఆయన అన్నారు.

# నాని ఈజ్ బ్యాక్!

### జగన్‌తో భేటీలో కీలక నిర్ణయం.. ఇక రచ్చరచ్చే..



తాజాగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లిన కొడాలి నాని అధినేత జగన్మోహనరెడ్డితో భేటీ అయ్యారని చెబుతున్నారు. కృష్ణా జిల్లా వైసీపీ పాలిటిక్స్ లో ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. గత కొంతకాలంగా రాజకీయ వ్యవహారా లకు దూరంగా ఉంటున్న మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత కొడాలి నాని తిరిగి యాక్టివ్ అవుతున్నారంటూ ఒక్కసారిగా ప్రచారం ఊపందుకుంది. తాజాగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లిన కొడాలి నాని అధినేత జగన్మోహనరెడ్డితో భేటీ అయ్యారని చెబుతున్నారు. వీరిద్దరి మధ్య అనేక రాజకీయాంశాలు చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. ప్రధానంగా కృష్ణా జిల్లా రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించాలని నానికి జగన్ రెడ్డి హితబోధ చేశారంటున్నారు. అధినేత జగన్ రెడ్డి సూచనతో మాజీ మంత్రి కొడాలి నాని మళ్లీ క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించినట్లు సమాచారం. తన సొంత నియోజకవర్గం గుడివాడతోపాటు ఉమ్మడి కృష్ణా జిల్లా బాధ్యతలను నానికి అప్పగించాలని జగన్ రెడ్డి భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వంలో దూకుడు చూపిన నాని వైసీపీ రాజకీయాల్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా ఎదిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ పై తీవ్ర విమర్శలు చేస్తూ తన కంటూ ఓ ఇమేజ్ తెచ్చుకున్నారు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల్లో నాని కొన్నాళు వెనక్కి తగ్గారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతల టార్గెట్ గా అరెస్టుల పర్వం కొనసాగింది. మాజీ మంత్రి నానిని అరెస్టు చేస్తారంటూ కొన్నాళ్లు తీవ్రమైన ప్రచారం జరిగింది. దీంతో ఆయన కొన్నాళ్లు తెరమరుగైనట్లు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అదే సమయంలో అనారోగ్యం పాలవడంతో సుమారు ఏడాదిన్నరగా విశ్రాంతి తీసుకుంటున్నారు. మధ్యలో కొద్ది రోజులు సొంత నియోజకవర్గానికి వచ్చి వెళుతున్నా, పార్టీ తరఫున కార్యక్రమాలకు దూరంగానే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో అధినేత జగన్ రెడ్డి ఒకటి రెండు సార్లు ఒత్తిడి తీసుకువచ్చినా, అరోగ్య కారణాల రీత్యా కొడాలి పార్టీ కార్యక్రమాలకు హాజరుకాలేకపోయారని చెబుతున్నారు. ఇక లండన్ పర్యటనకు ముగించుకుని వచ్చిన జగన్ రెడ్డిని మాజీ మంత్రి కొడాలి నాని ప్రత్యేకంగా కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ భేటీలో ఇద్దరు చాలా అంశాలను చర్చించుకున్నారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తుండటం, మరో రెండేళ్లు కష్టపడితే పార్టీని బలోపేతం చేసుకోవచ్చని ఇరువురు నేతలు అభిప్రాయపడినట్లు చెబుతున్నారు. మరో ఏడాది తర్వాత తాను పాదయాత్ర చేస్తానని జగన్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేసినందున మాజీ మంత్రి కొడాలి వచ్చే ఏడాది పాటు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా ఉండాలని మాజీ సీఎం జగన్ దిశానిర్దేశం చేసినట్లు చెబుతున్నారు. మొత్తానికి కొడాలి యాక్టివ్ అవ్వనున్నారనే ప్రచారం వైసీపీ వర్గాలను ఆకర్షిస్తోందని చెబుతున్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
శుక్రవారం, 15 మే 2026
www.viswamvoice.com



# పుష్కరాల నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

## అధికారుల తీరుపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : గోదావరి పుష్కరాలకు ఏడాది కాలం మాత్రమే ఉన్నా ఇంతవరకు అఖిల పక్ష పార్టీలతో ఎటువంటి సమావేశాలు నిర్వహించలేదని, కనీసం పుష్కరాల నిర్వహణ, నిధుల వివరాలను కూడా వెల్లడించలేని దుస్థితిలో అధికార యంత్రాంగం ఉన్నారని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వర రెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. స్థానిక మున్సిపల్ కాలనీ కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో టీకే మాట్లాడుతూ గోదావరిలో పుణ్యస్నానాలు చేసేందుకు పరిశుభ్రమైన నీరు కూడా లేదని, 95 కోట్లతో చేపట్టిన ఎస్‌టిపి ప్లాంట్ నిర్మాణం ఎప్పటికీ పూర్తవుతుందో అర్థం కావడం లేదన్నారు. రూరల్ ఎమ్మెల్యే ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఆ ప్లాంట్ వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. పేపర్ మిల్లు కాలుష్యం, వ్యర్థాలు గోదావరిలో కలవకుండా ఏ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పుణ్యస్నానాలు చేసే మాటేలా ఉన్నా మిక్స్‌డ్ ఫ్రూట్ జ్యూస్ లాంటా మలమత్ర వ్యర్థాలతో కలిసిన నీటిలో భక్తులు ఆచమనం చేయాలా అని అధికారులను నిలదీసారు. రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం, దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉందన్నారు. రాళ్లబండి సుబ్బారావు మ?యజియం నుంచి అభివృద్ధి పేరుతో తరలించిన అమల్యమైన సంపద ఎక్కడ భద్రపరిచారంటే కమీషనర్ సమాధానం చెప్పడం లేదని పేర్కొన్నారు. కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ఏయే పనులు చేపడున్నారో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి అక్కడికే వెళ్లి వాటిని పరిశీలన చేయడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ఉన్న ఏడాది సమయంలో నాలుగు నెలుగు వర్షాల సీజన్ అని ఏ పనులు చేపట్టడానికి అవకాశం ఉండదన్నారు. దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో చారిత్రాత్మకమైన చిత్రాలను చెదలు పట్టేసాయని, వాటిని భద్రపరిచేందుకు కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. తక్షణం హుకుంపేటలో జరుగుతున్న ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తి చేసి మురుగునీరు, చెత్త ఇతర వ్యర్థాలను గోదావరిలో కలవకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. పుష్కరాల పనులు, నిధులపై తక్షణం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసారు. అన్ని ఘాట్లను పుష్కర ఘాట్లుగా మార్చి క్రౌడ్ మేనేజ్‌మెంట్ చేస్తామని కలెక్టర్ చెబుతున్నారని అది సాధ్యమయ్యే పనికాదన్నారు. ముందుగా విఐపిలు పుష్కరాల రేవులో పుణ్య స్నానాలకు రాకుండా ఉంటే గత పుష్కరాల సమయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలు జరిగే ఆస్కారం ఉండదన్నారు. బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు ప్రజల సొమ్ము ఖర్చు చేస్తూ కమీషన్లు దండుకుంటున్నారే తప్ప ఏం చేస్తున్నారో చెప్పడం లేదని మండిపడ్డారు. శానిటేషన్, రోడ్లు, డ్రైనేజీల విస్తరణ, పార్కింగ్, యాత్రీకుల సౌకర్యాలపై ఎటువంటి దృష్టి సారించడం లేదని విమర్శించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులతో వెంటనే అఖిల పక్ష సమావేశం నిర్వహించి అభిప్రాయ సేకరణ చేయాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గోదావరి పుష్కరాలను వాళ్ల ఇంట్లో పెళ్లి మాదిరిగా చూస్తున్నారని, ఇది కోట్లాది మంది భక్తులకు సంబంధించిన విషయంగా గ్రహించాలని సూచించారు. నిధులు ఏం తెచ్చారో, ఎక్కడ అభివృద్ధి చేస్తున్నారో చెప్పకుండా తమ జేబులు నింపుకోవడానికి చూస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రతిష్టాత్మక గోదావరి పుష్కరాల నిర్వహణ విషయంలో చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించడం భావ్యం కాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు సింధియారాణి, డాక్టర్ రాజశేఖర్, యేసు, బర్రే సుబ్రహ్మణ్యం, చిన్నా, యాళ్ల వీరభద్రరావు, రాజు, సత్తిబాబు, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

### పురుషోత్తపట్నం సాధన మహిళా మండలి సేవా సంస్థ ఆధ్వర్యంలో

# ఉచిత కళ్ళజోళ్ల పంపిణీ



సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నంలో గల (ఎస్.ఎం.ఎం) సాధన మహిళా మండలి సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు మరియు వృద్ధులకు ఉచితంగా కళ్ళజోళ్లను పంపిణీ చేశారు.గత నెల అనగా ఏప్రిల్ 16న విదేశీ వైద్య బృందం డా. జాన్, డా. గ్రెగ్ ఈ సంస్థను సందర్శించి, ఇక్కడి పిల్లలకు మరియు వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారి సూచనల మేరకు, అవసర మైన వారికి విదేశాల నుండి ప్రత్యేకంగా కళ్ళజోళ్లను పంపించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు పి. సుజ్ఞాన కుమారి మాట్లా డుతూ పిల్లల విద్యా భ్యాసానికి కంటి చూపు సమస్య అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమమంలో భాగంగా 49 మంది పిల్లలకు 4 గురు వృద్ధులకు మొత్తం 53 మందికి కళ్ళజోళ్లను అందజేశారు. ఈ కార్య క్రమంలో సంస్థ ముఖ్య సలహాదారు పి. వెంకట రత్నం, మీడియా కో-ఆర్డి నేటర్ రాజీవ్ కుమార్, కోశాధికారి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.కళ్ళజోళ్లు పొందిన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు సంస్థ ప్రతినిధులకు మరియు విదేశీ వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అనుమతులు ఉన్న ప్రాంతాల్లోని ఇసుక త్రవ్వకాలు

### అధిక ధరలకు ఇసుక అమ్మితే కఠిన చర్యలు



సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా లో అక్రమ ఇసుక త్రవ్వకాలను కు అవకాశం లేదని పర్యావరణ అనుమతులు పొందిన రీచ్ లలో మాత్రమే త్రవ్వకాలు నిర్వహిస్తున్నామని భూగర్భ శాఖ అధికారి ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 64 ఇసుక రీచ్ లు అందుబాటులో ఉండగా ప్రజల అవసరాలకు అనుగుణంగా మాత్రమే ఇసుక సరఫరా జరుగుతుందన్నారు.

### నియోజకవర్గంలో 16కోట్ల పైబడి

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించాం : బత్తుల



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : ఎన్డీఏ ప్రభుత్వం నిరుపేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని నరసాపురం, కనుపూరు, బూరుగుపూడి గ్రామాల్లో ఇటీవల అనారోగ్యాలతో చికిత్స చేయించుకున్న రోగులకు బత్తుల చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.నరసాపురం గ్రామానికి చెందిన ముత్యాల శ్రీనుకు 40వేల రూపాయలు, కాకరపల్లి దుర్గకు 30వేల రూపాయలు, దొంగల గౌరమ్మకు 23వేల రూపాయలు, బూరుగుపూడి గ్రామానికి చెందిన తోలేటి జయకు లక్ష రూపాయలు, కనుపూరు గ్రామానికి చెందిన మామిడి శ్రీనివాస్‌కు 56వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయని చెక్కులను ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమంతో పాటు అనారోగ్యంగా ఉన్నవారికి సకాలంలో సుమారు 15 కోట్ల రూపాయలు పైబడి ముఖ్యమంత్రి సహాయ చెక్కులను అందించమన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆప్యాయతగా పలకరించి, సకాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేస్తే వారి కళ్ళలోని ఆనందాన్ని చూడడం కోసం బత్తుల కుటుంబం తహతహలాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు కంటే నాగకేశవరావు, అడ్డాల శ్రీను, అడపా శ్రీనివాస్, మట్టా నాగేశ్వరరావు, ప్రగడ జోగారావు, చొంగా తేజ, రాయపాటి సత్యనారాయణ, ప్రగడ దేవి, పలువురు జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మన గ్రామీణస్థాయి క్రీడాకారులను అన్ని విధాల ప్రోత్సహిద్దాం : బత్తుల



కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ : గ్రామీణ స్థాయిక్రీడల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను అన్ని విధాల ప్రోత్సహించవలసిన బాధ్యత మన అందరిపై ఉందని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లో త్వరలో జరగనున్న వైఎస్ఎస్ఎ నేషనల్ ఛాంపియన్షిప్ - 2026' పోటీలకు ఎంపికైన రాజానగరం నియోజకవర్గ క్రీడాకారులకు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బుధవారం తన స్వగృహంలో గతంలో ప్రకటించిన విధంగానే జాతీయస్థాయికి ఎంపికైన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి 15వేల రూపాయల చొప్పున నగదును విద్యార్థులకు అందజేసి, భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదగాలని బత్తుల బలరామకృష్ణ వెంకట లక్ష్మీ దంపతులు ఆశీర్వదించారు. క్రీడాకారుల ప్రయాణ ఖర్చులు, ఇతర అవసరాల నిమిత్తం తన వంతు సహకారంగా75వేల రూపాయల నగదును బత్తుల దంపతులు.ఈ నెల 22 నుండి 25 వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో నిర్వహించే పోటీల్లో మన విద్యార్థులు పాల్గొనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఏడిద యాషువ ఇమ్మాన్యుయేల్, మల్లవరపు అశ్విన్, అక్కిన యస్వంత్, చెల్లుబోయిన సతీష్, అండిబోయిన వెంకట కావ్య శ్రీ లను అభినందించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి మంచి ప్రతిభ కనబరుస్తూ జాతీయ వేదికపై మెరవాలని,విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.శిక్షణ అందించిన మాస్టర్ పిల్లి అరుణ్ కుమార్,కోచ్ కాంద్రేగుల అనూష తేజస్వినిలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పవన్ కుమార్, యర్రంశెట్టి పోలారావు, అడపా శ్రీనివాస్, ముక్క రాంబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో రైతు సేవా కేంద్రాలలో ధరిత మతా బచావో కార్యక్రమం



సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంక,చిన కొండేపూడి గ్రామ రైతు సేవా కేంద్రాలలో ధరితి మతా బచావో కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కోరుకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు డి.శ్రీనివా సరావు మాట్లాడుతూ రైతులు భూసారం పెంచుకోవాలని అందుకుగాను పీఎండీఎస్ కిట్లు అనగా 30 రకముల విత్తనములతో వేసవిలో వేసి భూమిలోకి దున్నడం ద్వారా రసాయని ఎరువులు బదులుగా ఉపయోగించుట వలన భూమికి పోషకాలు చేరతాయని వివరించారు.ప్రతి రైతు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైరు వినియోగించాలని తెలిపారు. ఎరువుల యాజమాన్యం గురించి తెలియజేశారు. వ్యవసాయ అధికారిణి ఆర్.ప్రశాంతి మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ గురించి వివరించారు. వ్యవసాయ పనిముట్లను, పవర్ టిల్లర్లు, మినీ ట్రాక్టర్లు మొదలైనవి రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులకు మరియు మహిళా రైతులకు 50% రాయితీపైన ఇస్తున్నట్లు తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని మరియు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరి తేదీ 19/05/26 అనితెలిపారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు,వ్యవసాయ విస్తరణ అధికారిణి మరియు రైతులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పేరుతో

# అంతిమయాత్రకే అడ్డంకులా..?

### చక్కగా ఉన్న రహదారిని తవ్వి ప్రజలకు నరకయాతన..
### శవయాత్రకు సైతం దారి లేక ప్రజల ఆవేదన



రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ : మండల కేంద్రమైన రాయవరంలో అధికారులు చేపట్టిన రహదారి పనులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులను మిగులుస్తున్నాయి. ఇప్పటికే బాగానే ఉన్న గ్రావెల్ రహదారిని అభివృద్ధి పేరుతో మళ్లీ తవ్వి అస్తవ్యస్తంగా మార్చడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళితవాడ శివారులో గల మర్రిచెట్టు వద్ద నుండి తుల్యబాగా నది పక్కనుగా వెదురుపాక వైపు వెళ్లే ఈ రహదారి ప్రస్తుతం రాళ్లతో ప్రమాదకరంగా మారింది. పనులు ప్రారంభించి రోజులు గడుస్తున్నా పూర్తి చేయకపోవడంతో ప్రజలు నిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పొలాల నుండి ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్లకు మార్గం లేక ఇబ్బంది పడుతుండగా, పాడి రైతులు పశువులకు గడ్డి తీసుకురావడానికి కూడా ద్విచక్ర వాహనాలపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వెదురుపాక, సావరం, కొంకుదురు గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక తాజాగా గ్రామంలో చోటుచేసుకున్న మరణ ఘటనతో ఈ రహదారి సమస్య మరింత దారుణంగా బయటపడింది. మరణించిన వ్యక్తిని అంతిమయాత్రకు తీసుకెళ్లేందుకు సైతం సరైన దారి లేక గ్రామస్తులు యాతన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. భుజం కాసే నలుగురికి కూడా సరిగా నడిచే మార్గం లేక మట్టికుప్పలు, రాళ్ల మధ్యగా శవయాత్ర నిర్వహించాల్సి రావడం గ్రామస్తులను కలచివేసింది. చక్కగా ఉన్న రహదారిని ఎందుకు మరలా వేస్తున్నారు.? పనులు మొదలుపెట్టి మధ్యలో వదిలేయడం వెనుక ఉద్దేశ్యం ఏమిటి..? ప్రజల ఇబ్బందులు అధికారులకు కనిపించడం లేదా..? అంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. అభివృద్ధి పేరుతో ప్రజా నిధులను ఖర్చు చేస్తూ కనీస ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడం వల్ల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా, మండల అధికారులు స్పందించి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### మారేడుబాకలో

# వాటర్ ట్యాంక్ నిర్మాణం

### భూమిపూజలో ఎమ్మెల్యే వేగుళ్ళ



మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ : గ్రామీణాభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు.మండపేట మండలం మారేడుబాక మహిళానగర్ లో జల జీవన్ మిషన్ ద్వారా రూ.38.90 లక్షలతో నిర్మించనున్న 40 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గురువారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ తో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, మాజీ ఎంపీటీసి పసలపూడి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు రాయుడు గంగరాజు, యరమాటి సుబ్బారావు, చోడసాని మురళీ, వాసంశెట్టి శ్రీనివాస్, వల్లూరి చిన్నారావు, గుత్తుల వెంకటలక్ష్మి, గుత్తుల సూర్యకుమారి, వాసంశెట్టి పద్మావతి, ఖండవల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ ఎరువులు పురుగుమందు షాపు తనిఖీ



సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా సీతానగరం నందు శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ ఎరువులు మరియు పురుగు మందుల షాపును కోరుకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు డి. శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారిణి ఆర్.ప్రశాంతి సాధారణ నాణ్యత నియంత్రణ తనిఖీలో భాగంగా తనిఖీ చేయడం జరిగింది .ఇందులో భాగంగా ఎరువులు మరియు పురుగుమందుల డీలర్లకు నాణ్యమైన ఎరువులు మరియు పురుగు మందులు మాత్రమే విక్రయించాలని తెలియజేయడం జరిగింది. బిల్లు లేనిదే ఎరువులు మరియు పురుగు మందులు విక్రయించరాదని స్టాక్ బోర్డును ప్రతిరోజు అప్డేట్ చేయాలని తెలియ చేశారు.నాణ్యతా ప్రమాణాలను అధిగమించినచో కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు.

# ఘనంగా శ్రీ మహబూబ్ వలి, అహ్మద్ వలి గందోత్సవం



సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : గ్రామంలో వెలసిన శ్రీ మహబూబ్ వలి అహ్మద్ వలిజహీరా బీబీల గందోత్సవం ఘనంగా నిర్వహించారు.ముందుగా ఫకీరుల మేళతో బ్యాండుతో గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువచ్చి అనంతరం బాబా వారి గుమ్మస్తులపై తొడిగి గంధాన్ని పూసి జెండాను కట్టి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అక్కడికి వచ్చిన భక్తులందరికీ భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా అన్ని మతాల వారు పాల్గొని మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బాబా గారి దర్శనానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి కాక ఇతర ప్రాంతంలో నుండి కూడాభక్తులు వచ్చి దర్శించుకున్నారు.ఈ కార్యక్రమం దర్గా కమిటీ ఆద్వర్యంలో భక్తుల సహాయ సహకారాలతో నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలియచేసారు.



# దీపికకు కోపం వస్తే ఇలా చేస్తుందా?

## షూటింగ్‌లోనే డైరెక్టర్ తల పగలగొట్టిందిగా..



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకొణె క్రేజ్, పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పెళ్లై, పిల్లలున్నా ఆమె రేంజ్ ఏ మాత్రం తగ్గడం లేదు. హిందీతో పాటు తెలుగులోనూ ఆమెకు వరుసగా అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ రాకా సినిమాలో కథానాయికగా చేస్తోంది దీపిక. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకొణె ఇప్పుడు తెలుగు సినిమాలతోనూ బిజీ అవుతోంది. ఇప్పటికే ఆమె ప్రభాస్ నటించిన కల్కి సినిమాలో హీరోయిన్ గా నటించింది. తన దైన నటనతో తెలుగు ఆడియెన్స్ కు బాగా చేరువైపోయింది. ఇప్పుడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తోన్న 'రాకా'లోనూ దీపికనే హీరోయిన్. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఇక హిందీలోనూ పలు క్రేజీ ప్రాజెక్టుల్లో ఈ బ్యూటీ నటిస్తోంది. హీరో రణ్ వీర్ సింగ్ తో పెళ్లి, పిల్లల తర్వాత సినిమాలు తగ్గినప్పటికీ దీపిక క్రేజ్ కొంచెం కూడా తగ్గలేదు. ఇదంతా పక్కన పెడితే దీపికకు సంబంధించిన ఒక ఓల్డ్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరలవుతోంది. దీనిని చూసిన నెటిజన్లు వామ్మో దీపికకు కోపం చాలా ఎక్కువేనంటూ ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. దీపికా పదుకొణె హీరోయిన్ గా నటించిన సూపర్ హిట్ సినిమాల్లో చెన్నై ఎక్స్ ప్రెస్ ఒకటి. సౌత్ ఇండియన్ సినిమాల ఫ్లేవర్ తో బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి ఈ సినిమాను తెరకెక్కించాడు. బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ ఇందులో హీరోగా నటించాడు. 2013లో రిలీజైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద ఏకంగా 400 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. అయితే ఈ సినిమా సెట్ లో ఒక ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఈ సినిమా షూటింగ్ సెట్ లో దీపికా పదుకొనే రిలాక్స్ డ్ గా కూల్ డ్రింక్ తాగుతుండగా డైరెక్టర్ రోహిత్ శెట్టి అడ్డుకుంటాడు. దీంతో కోపం తెచ్చుకున్న దీపికా పదుకొనే తన చేతిలోని బాటిల్ ని తీసుకొని, రోహిత్ శెట్టి తలపై కొడుతుంది. అంతే బాటిల్ ముక్కలవుతుంది. దెబ్బకు రోహిత్ శెట్టికి రక్తం కారుతుంది. దీంతో అక్కడున్నవారందరూ ఒక్కసారిగా షాక్ కి గురయ్యారు. అయితే ఇదంతా ఒక ఫన్నీ ఇన్సిడెంట్. దీపికా చేతిలో ఉన్నది నిజమైన బాటిల్ కాదు , షుగర్ బాటిల్. మన బిగ్ బాస్ రియాలిటీ షోస్ లో నామినేషన్స్ సమయంలో ఇలాంటి షుగర్ బాటిల్స్ ను ఉపయోగిస్తుంటారు. అదే ఇది. కేవలం ఫన్నీ బ్లూపర్ గానే ఈ షాట్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

# ఆ మూవీకి రూ. 25 కోట్లు నష్టం..! అందుకే నా మేకింగ్ స్టైల్ మారింది.. ఆర్జీవీ



రామ్ గోపాల్ వర్మ సినిమా తీసే విధానం అందరికంటే భిన్నంగా ఉంటుంది. తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ ఎఫెక్ట్ ఎలా తీసుకురావాలో ఆయనకు బాగా తెలుసు. కెమెరా యాంగిల్స్ నుండి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వరకు ప్రతి విషయంలోనూ ఆయన ఒక విలక్షణతను చూపిస్తారు. సినిమా అనగానే మనకు గుర్తొచ్చేది గ్లామర్, భారీ సెట్లు, వందల కోట్ల వసూళ్లు. కానీ, ఒక సినిమా వెనుక ఉండే లెక్కలు, బడ్జెట్ ప్లానింగ్, మేకింగ్ వెనుక ఉన్న అసలు ఫిలాసఫీ గురించి దర్శకుడు రామ్ గోపాల్ వర్మ చెప్పే విషయాలు ఎప్పుడూ ఆసక్తికరంగా ఉంటాయి. ఆయన దృష్టిలో సినిమా అనేది కేవలం రంగుల ప్రపంచం కాదు, అది ఒక పక్కా మేనేజ్మెంట్, క్రియేటివిటీ కలయిక. మనలో చాలామంది ఆర్జీవీ అంటే వివాదాలకు కేరాఫ్ అడ్రస్ అని అనుకుంటాం కానీ, ఆయన మేకింగ్ స్టైల్ వెనుక ఒక అద్భుతమైన స్పష్టత ఉంటుంది. సాధారణంగా ఒక సినిమా బడ్జెట్ అంటే స్టార్ హీరోల రెమ్యూనరేషన్, భారీ యాక్షన్ సీక్వెన్స్ అని మనం భావిస్తాం. అయితే ఆర్జీవీ మాటల్లో చెప్పాలంటే, సినిమాకు ఎంత కావాలో అంత ఖర్చు పెట్టడమే అసలైన మేకింగ్. అనవసరమైన ఆడంబరాలకు పోయి డబ్బు వృధా చేయడం కంటే, కథకు అవసరమైన సహజత్వాన్ని తీసుకురావడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన నమ్ముతారు. సినిమా మేకింగ్ లో "హానెస్టీ" లేకపోతే, ఎంత ఖర్చు పెట్టినా ప్రేక్షకులు దాన్ని రిజెక్ట్ చేస్తారని ఆయన గట్టిగా చెబుతారు. సినిమా వసూళ్ల గురించి మాట్లాడుతూ, మార్కెట్ లెక్కలు ఎలా మారిపోయాయో ఆయన వివరించారు. ఒకప్పుడు 40 లక్షలతో తీసిన సినిమా కోట్లు వసూలు చేసేది, కానీ ఇప్పుడు వందల కోట్లు పెట్టినా గ్యారెంటీ లేని పరిస్థితి. దీనికి ప్రధాన కారణం దర్శకులు తమ సొంత గొంతును మర్చిపోయి, బయట ఉన్న అనవసరమైన గందరగోళానికి ప్రభావితం కావడమే. కొత్తగా వచ్చే ఫిల్మ్ మేకర్స్ తమ ఐడియా మీద నమ్మకంతో కాకుండా, వేరే వాళ్ళను అనుకరించడం వల్ల ఫెయిల్ అవుతున్నారని ఆయన విశ్లేషించారు. ఇక ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సినిమా రంగంపై చూపుతున్న ప్రభావం గురించి కూడా ఆర్జీవీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఎఐ అనేది డేటా ఆధారంగా పనిచేస్తుందని, కానీ సినిమా అనేది ఒక అనుభూతి అని ఆయన అంటారు. ప్రభాస్ వంటి పాన్ ఇండియా స్టార్లు దేశంలోనే అత్యధిక రెమ్యూనరేషన్ తీసుకోవడం వెనుక ఉన్న మార్కెట్ లాజిక్‌ను ఆయన సమర్థించారు.

# నాగబాబు మేము'కాప్'లం ట్రైలర్ వచ్చేసింది..

## ఓటీటీలో స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



మెగా బ్రదర్ నాగబాబు ప్రధాన పాత్రలో నటిస్తోన్న వెబ్ సిరీస్ మేము 'కాప్'లం. జబర్దస్త్ గెటప్ శీను మరో కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ వెబ్ సిరీస్ త్వరలో ఓటీటీ స్ట్రీమింగ్ కు రానుంది. తాజాగా దీని ట్రైలర్ ను రిలీజ్ చేశారు మేకర్స్. జీ5 ఎప్పటికప్పుడు వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో డిఫరెంట్ వెబ్ సిరీస్‌తో ఆడియెన్స్‌ను అలరించటానికి సిద్ధమైంది. అదే "మేము'కాప్'లం". కొన్నాళ్ల నుంచి ఈ సిరీస్ టైటిల్ దగ్గర నుంచి ప్రతీ విషయంలోనూ క్యూరియాసిటీని పెంచుతోంది. మే 22 నుంచి ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్‌పై మరింత ఆసక్తిని పెంచేలా "మేము'కాప్'లం" ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. మహదేవపట్నం అనే ప్రాంతంలో కథ మొదలవుతుంది. అయ్యగారు వారసుడొచ్చాడండోయ్.. అని పాలేరు అని అరిచి మరి చెబుతాడు. అప్పుడు గజపతిరాజు పాత్రలో నటించిన నాగబాబు ఆనందపడతాడు. సలార్‌రాజు తన వారసుడు అని ప్రకటిస్తాడు. అయితే అనుకోకుండా ఆ సలార్ రాజు కనిపించకుండా పోతాడు. దీంతో ఊరంతా గందరగోళంలో పడుతుంది. ఇంతకీ సలార్ రాజు ఎవరో కాదు.. కోళ్ల పందెల్లో పాల్గొనాల్సిన కోడిపుంజు. దీన్ని వెతకటానికి ఇద్దరు పోలీసులు(గెటప్ శీను, రవితేజ నన్నిమల) ఊళ్లోకి వస్తారు. సలార్ రాజు కనిపించకపోవటం వల్ల..ఎవరికి లాభం అనే కోణంలో పోలీసులు అన్వేషిస్తుంటారు. అయితే వారికి ఊళ్లో మరో సమస్య కనిపిస్తుంది. దీంతో వాళ్లు కొత్త సమస్య నుంచి ఊరిని బయటపడేయటానికి ప్రయత్నిస్తారు. ఇంతకీ మహదేవపట్నంలోని ప్రధాన సమస్య ఏంటి? పోలీసులు దాన్ని ఎలా పరిష్కరిస్తారు. అసలు ఇంతకీ సలార్ రాజు దొరికాడా? లేదా? అనే విషయాలు తెలియాలంటే మే 22న జీ5లో స్ట్రీమింగ్ కానున్న "మేము'కాప్'లం" వెబ్ సిరీస్ చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. నాగబాబు ప్రధాన పాత్రలో నటించిన "మేము 'కాప్'లం" సిరీస్‌ను రా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి, కౌముది కె నేమాని నిర్మాతలుగా ప్రదీప్ మద్దాలి క్రియేటివ్‌తో కలిసి రూపొందింది. 'వికటకవి' డైరెక్టర్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. శోభన్ చిట్టుప్రోలు కథను అందించారు. గెటప్ శ్రీను, రవితేజ నన్నిమల కీలక పాత్రల్లో నటించారు. కామెడీ, మిస్టరీ కలయికగా అందరినీ ఆకట్టుకునే కథాంశంతో..గ్రామీణ నేపథ్యంలో, అక్కడి రోజువారీ జీవితం, స్థానిక రాజకీయాలు, ఊహించని గందరగోళం..ఇలా అన్నీ కలగలిపిన ఆసక్తికరమైన కథతో ఈ సిరీస్ తెరకెక్కింది. కోడి పందేలనే పిచ్చిలో మునిగిపోయిన గ్రామంలో ఊరిలో డబ్బున్నవారందరూ పోటీ పడుతుంటారు. వారిలో ఒక వ్యక్తికి సంబంధించిన పందెం కోడి ఆకస్మాత్తుగా కనిపించకుండా పోతుంది. దీంతో గ్రామంలో ఓ గందరగోళం మొదలవుతుంది. ఆ కేసు విచారణ బాధ్యతను పోలీసు అధికారులు ఇద్దరు అమాయక పోలీసులైన రవి, మోహన్ సోటారిలకు అప్పగిస్తారు. కోడి కోసం అన్వేషణ సాధారణంగా మొదలవుతుంది. అయితే అనుకోని ఘటనతో కేసు ఓ పెద్ద మిస్టరీగా మారిపోతుంది. విచారణలో వారు చేసే తప్పులు, ఎదురయ్యే విచిత్ర పరిస్థితులు నవ్వులు పూయిస్తూనే ఉంటాయి. కానీ ఆ గందరగోళంలోనే వారు అనుకోకుండా గ్రామపు మూలాలను కదిలించే ఒక పెద్ద రహస్యానికి దగ్గరవుతారు. లోకల్ ఫ్లేవర్‌తోబలమైన, వ్యంగ్యమైన పాత్రల చుట్టూ తిరిగే కథనం, కథా పాత్రలతో "మేము కాప్'లం" తెలుగు జుజు5 ఒరిజినల్స్‌లో మరోసారి ప్రేక్షకులను మెప్పించే వెబ్ సిరీస్‌గా అలరించనుంది. మనం ఎప్పుడూ చూసే, మనల్ని ప్రతిబింబించే కథలను ఆధునిక మేళవింపుతో చూపించే జీ5 ప్రాజెక్ట్‌ల జాబితాలో ఇది ఒకటిగా మెప్పించనుంది.

# ముంబై ఇండియన్స్‌కు షాక్.. జట్టును వీడనున్న హార్దిక్ పాండ్యా..

ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. పేలవ ప్రదర్శనతో ప్లేఆఫ్స్ చేరకుండానే ఇంటికి చేరింది. ఈ క్రమంలో ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై విమర్శలు వినిపించిన సంగతి తెలిసిందే. తాజాగా వచ్చే సీజన్‌కు ముందే ట్రేడ్ జరగనుందని, హార్దిక్ టీం నుంచి బయటకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్ నుంచి ముంబై ఇండియన్స్ నిష్క్రమించిన వేళ, ఆ జట్టు సారథి హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వరుస పరాజయాలు, గాయాల సాకుతో మ్యాచ్‌లకు దూరం కావడం వంటి పరిణామాల మధ్య పాండ్యా మరో జట్టులోకి వెళ్తున్నారనే వార్తలు క్రీడా వర్గాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో అసలు నిజమేంటో తాజా నివేదికలు స్పష్టం చేశాయి.

**చెన్నై సూపర్ కింగ్స్ వైపు హార్దిక్ చూపు..?**

ముంబై ఇండియన్స్ సారథి హార్దిక్ పాండ్యా త్వరలోనే చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో చేరబోతున్నారనే ఊహాగానాలు గత కొద్ది రోజులుగా ఇంటర్నెట్‌లో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. మే 2వ తేదీన చెన్నైతో జరిగిన మ్యాచ్ ముగిసిన తర్వాత, ఆ జట్టు ముఖ్య కార్యనిర్వాహక అధికారి కాశీ విశ్వనాథన్‌తో పాండ్యా సుదీర్ఘంగా చర్చలు జరపడం ఈ అనుమానాలకు బలం చేకూర్చింది. గతంలో సంజూ శాంసన్ కూడా ఇలాగే చర్చలు జరిపి ఆ తర్వాత చెన్నై



జట్టులోకి మారడంతో, ఇప్పుడు పాండ్యా కూడా అదే బాటలో పయనిస్తారని అభిమానులు భావిస్తున్నారు.

**గాయంపై సందిగ్ధత.. ప్రాక్టీస్ వీడియో వైరల్..**

ప్రస్తుతం పంజాబ్ కింగ్స్‌తో జరుగుతోన్న కీలక మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ దూరమయ్యారు. గాయం కారణంగా పాండ్యా ఆడటం లేదని ఫ్రాంచైజీ చెబుతున్నప్పటికీ, సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్ట్ చేసిన ఒక వీడియో కొత్త చర్చకు దారితీసింది. రాత్రి సమయంలో నెట్స్‌లో ఎంతో వేగంగా, ఎటువంటి అసౌకర్యం లేకుండా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ ఆయన కనిపించాడు. దీంతో ఆయన నిజంగానే గాయపడ్డాడా లేక జట్టు యాజమాన్యంతో విభేదాల వల్లే పక్కన ఉంటున్నాడా అనే సందేహాలు తలెత్తాయి.

**యాజమాన్యం స్పందన: ప్రస్తుతానికి ట్రేడ్ లేదు..**

ఈ వివాదాల నేపథ్యంలో ప్రముఖ క్రీడా జర్నలిస్ట్ విజయ్ ఠాగూర్ కీలక విషయాలను వెల్లడించారు. ముంబై ఇండియన్స్ వర్గాల సమాచారం ప్రకారం, హార్దిక్ పాండ్యాను వేరే జట్టుకు విక్రయించే ఆలోచన ప్రస్తుతం యాజమాన్యానికి లేదు. ఆయన ఒంటరిగా ప్రాక్టీస్ చేస్తున్నప్పటికీ, జట్టు వైద్య బృందం నిరంతరం ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తోందని సమాచారం. ప్రస్తుతానికి ముంబై జట్టు ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకున్నప్పటికీ, తమ సారథిని వదులుకోవడానికి వారు సిద్ధంగా లేరని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రోహిత్ శర్మ స్థానంలో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి హార్దిక్ పాండ్యా తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నారు. అయితే, 2027 సీజన్ కోసం జరగబోయే వేలంలో ఏవైనా మార్పులు జరిగితే తప్ప, ప్రస్తుతానికి ఆయన ముంబై ఇండియన్స్ నీడలోనే కొనసాగనున్నారు. అభిమానులు ఎదురుచూస్తున్న ఈ 'ట్రేడ్' ప్రస్తుతానికి కేవలం ఊహాగానమే అని తెలుస్తోంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




# రాసిపెట్టుకోండి.. ఈసారి టైటిల్ మాదే.. మా టీంలో మెంటలోడిని తట్టుకోలేరంతే..!

ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ అప్రతిహత విజయాలతో దూసుకుపోతోంది. మైదానంలో పక్కా ప్రణాళికలతో బరిలోకి దిగుతున్న గిల్ సేన, తాజాగా సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోవడమే కాకుండా, తమ టైటిల్ వేటను మరింత ముమ్మరం చేసింది. మంగళవారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో గుజరాత్ టైటాన్స్ 82 పరుగుల భారీ తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తు చేసింది. ఈ సీజన్‌లో 200 పైచిలుకు స్కోర్లను కూడా జట్లు సులభంగా ఛేదిస్తున్న తరుణంలో, కేవలం 160 పరుగుల స్కోరును కాపాడుకోవడం గుజరాత్ జట్టు బౌలింగ్ పటిమకు నిదర్శనంగా మారింది. ఈ భారీ విజయం గుజరాత్ ఆటగాళ్లలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది.

**విజయ రహస్యం వెల్లడించిన శుభమన్ గిల్..**

మ్యాచ్ అనంతరం కెప్టెన్ శుభమన్ గిల్ మాట్లాడుతూ తమ గెలుపు వెనుక ఉన్న అసలు రహస్యాలను పంచుకున్నాడు. అహ్మదాబాద్ పిచ్ స్వభావాన్ని బట్టి తాము ముందే ఒక అంచనాకు వచ్చామని ఆయన తెలిపాడు. "ఈ వికెట్‌పై 170 పరుగులు చేయడం చాలా సవాలుతో కూడుకున్న పని. మేం 160 నుంచి 170 పరుగులు చేస్తే, మా బౌలింగ్ దళం ఆ స్కోరును సులభంగా కాపాడుకోగలదని మాకు నమ్మకం ఉంది" అని గిల్ ధీమా వ్యక్తం చేశాడు.

**ప్రణాళికాబద్ధమైన బౌలింగ్, ఫీల్డింగ్..**

సన్‌రైజర్స్ హైదరాబాద్ బలమైన బ్యాటింగ్ లైనప్‌ను అడ్డుకోవడానికి గుజరాత్ ప్రత్యేక వ్యూహాలను అమలు చేసింది. ముఖ్యంగా టాప్ ఆర్డర్ బ్యాటర్లను త్వరగా పెవిలియన్ పంపడానికి వేసిన ప్రణాళికలు అద్భుతంగా పనిచేశాయి. సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ వంటి ఆటగాళ్లు స్లో పిచ్‌పై పరిస్థితులకు తగ్గట్లుగా రాణించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించడంలో కీలక పాత్ర పోషించారు.




**గెలుపు మంత్రం: జాసన్ హోల్డర్..**

జట్టు విజయాల్లో వెస్టిండీస్ ఆల్ రౌండర్ జాసన్ హోల్డర్ పాత్రను గిల్ ప్రత్యేకంగా ప్రశంసించాడు. హోల్డర్ వేస్తున్న లెంగ్త్ బంతులు ప్రత్యర్థి బ్యాటర్లకు కష్టంగా మారుతున్నాయని, అతను ప్రతి మ్యాచ్‌లో తన కోటా నాలుగు ఓవర్లను సమర్థవంతంగా వేస్తూ జట్టుకు వెన్నెముకలా నిలుస్తున్నారని గిల్ పేర్కొన్నాడు. హోల్డర్ ప్రస్తుతం గుజరాత్ జట్టుకు ఒక 'గెలుపు మంత్రం'లా మారిపోయాడు.

**టైటిల్ లక్ష్యంగా గుజరాత్ ప్రస్థానం..**

వరుసగా ఐదు విజయాలు సాధించిన గుజరాత్ టైటాన్స్, ఈసారి కూడా ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. "మేం కేవలం ఒక బ్రాండ్ క్రికెట్‌కు మాత్రమే పరిమితం అవ్వాలనుకోవడం లేదు. పిచ్ పరిస్థితులను బట్టి గెలిచే జట్టుగా ఉండాలనుకుంటున్నాం. ఈసారి టైటిల్ గెలవబోతున్నాం, కావాలంటే రాసి పెట్టుకోండి" అంటూ గిల్ చేసిన వ్యాఖ్యలు అభిమానులలో జోష్ నింపుతున్నాయి. సమిష్టి కృషితో పంజాబ్ కింగ్స్ లాంటి జట్లు ప్లేఆఫ్స్ కోసం పోరాడుతుంటే, గుజరాత్ టైటాన్స్ మాత్రం ఇప్పటికే అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకుంది. కెప్టెన్ గిల్ నాయకత్వంలో యువ, సీనియర్ ఆటగాళ్ల కలయికతో గుజరాత్ జట్టు ప్రస్తుతం అత్యంత ప్రమాదకరమైన జట్టుగా అవతరించింది. ఇదే జోరు కొనసాగితే 2026 టైటిల్ గుజరాత్ ఖాతాలో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

**గుజరాత్ టైటాన్స్ టీం గురించి తరచుగా అడిగే ప్రశ్నలు:**

1. గుజరాత్ టైటాన్స్ ప్రస్తుత స్థానం ఏమిటి?

ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టికలో గుజరాత్ టైటాన్స్ ప్రస్తుతం 2వ స్థానం (14వ తేదీ వరకు)లో ఉంది.

2. సన్ రైజర్స్‌పై గుజరాత్ ఎంత తేడాతో గెలిచింది?

సన్ రైజర్స్‌పై హైదరాబాద్‌పై గుజరాత్ టైటాన్స్ 82 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

3. శుభమన్ గిల్ గెలుపు క్రెడిట్ ఎవరికి ఇచ్చారు?

సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, ముఖ్యంగా జాసన్ హోల్డర్ అద్భుత ప్రదర్శన వల్లే ఈ విజయం సాధ్యమైందని గిల్ తెలిపారు.

4. జాసన్ హోల్డర్ ప్రదర్శన ఎలా ఉంది?

హోల్డర్ ప్రతి మ్యాచ్‌లోనూ నాలుగు ఓవర్ల కోటాను పూర్తి చేస్తూ, పక్కా లెంగ్త్‌లతో బౌలింగ్ చేస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

5. ఈ సీజన్‌లో గుజరాత్ వరుసగా ఎన్ని మ్యాచ్‌లు గెలిచింది?

గుజరాత్ టైటాన్స్ ఈ సీజన్‌లో వరుసగా ఐదు విజయాలను నమోదు చేసింది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com